కవిత్వం

కాలగీత



డా. సూరం శ్రీనివాసులు

జయభాస్కర
ప్రచురణలు



kaala geeta

poetry by

dr. suram srinivasulu

కాలంపై పలు రంగులద్ది గీసిన గీతల సమాహారమే ఈ గీత. కాలమనే బండపై ఉలులతో మలచిన శిల్పకళాఖండమే ఈ గీత... సంస్కృతాంధ్రభాషా నిష్ణాతులైన డాక్టర్ సూరం శ్రీనివాసులు గారు పుట్టుకతో వచ్చిన ప్రతిభతో పాటు నిరంతర పరిశ్రమతో వ్యుత్పత్తిని నిండుగా సంపాదించుకొని, ఎడతెగని అభ్యాసంతో బహువిధ సాహిత్య ప్రక్రియలలో తన కవితాఝరిని ప్రవహింప చేశారు. వారి రచనలన్నీ ఆలోచనామృతాలే.

– మెట్టు రామచంద్ర ప్రసాద్

ఇది ఇసుక గడియారంతో కానీ, నీళ్ల గడియారంతో కానీ, నీడ గడియారంతో కానీ, గోడ గడియారంతో కానీ కొలవదగ్గ 'కాలగీత' కాదు. అక్షరాల ఉంగరాలతో రాసిన గీత. రెండు చరబిందువుల మధ్య నుండి వెలికివచ్చిన కాల యవనిక. శ్రద్ధతో, స్థిరబుద్ధితో – నిష్ఠతో, పరినిష్ఠతో – సూరం శ్రీనివాసులు కవిగా మనఃప్రసారాలనూ, బుద్ధివికాసాలనూ, భావప్రకాశాలనూ, ధ్యానవిధానాలనూ, గానవినోదాలనూ, జ్ఞాననినాదాలనూ గమనించి అక్షరీకరించిన కాలకొలమానం ఈ 'కాలగీత'.

– విశ్వర్షి వాసిలి

Rs. 100/-

9 789357 806688

కాలగీత

డా. సూరం శ్రీనివాసులు

జయభాస్కర ప్రచురణలు

Publication No. PST09/09

కాలగీత

డా. సూరం శ్రీనివాసులు

ISBN No: 978-93-5780-668-8

9 789357 806688

ప్రథమ ముద్రణ: **ఫిబ్రవరి 2023**

పుటలు: 92

ప్రతులు: 500

వెల: **₹ 80** /-

ప్రతులకు:
డా. సూరం శ్రీనివాసులు
ప్లాట్ నం. 24, 4వ మైలు సెంటర్
షిర్డి నగర్, మసీదు దగ్గర,
నవలాక్ గార్డెన్, నెల్లూరు – 524002
సెల్: 9440242348.

విట్టుబాబు, హైదరాబాద్, 8555082034.

Cover page image courtesy : in.pinterest.com

Printed @

Jaya Bhaskara Printers

S3, 2nd Floor, 31 & 32, Road No.4, RKH colony
Dr. A.S.Rao Nagar, Hyderabad – 500062
Contact: 8555082034

సూరంవారి కాలనేత

– విశ్వర్షి వాసిలి

కవికి కాలం మచ్చలు "నీ మీదా - నా మీదా - మనందరి మీదా" కనిపించినప్పుడు కాలం కావ్యవస్తువు అవుతుంది. సూరంకవి "కాలగీత"లా దీర్ఘకవిత అవుతుంది. "ఆశల మీదా ఆశయాల మీదా / అదేపనిగా కత్తికట్టిన కాలం" "కచ్చిపోతుతనం"తో దర్శనమై ఇతిహాసం అవుతుంది. తనను తాను ఆవిష్కరించుకుంటూ మానవేతిహాసాన్నీ అక్షరీకరిస్తుంది. మాయని మచ్చలకి వాచ్యంగానో, వ్యంగ్యంగానో దర్పణమై నిలుస్తుంది. ప్రతి కవితా ఖండికా డా. సూరం శ్రీనివాసులుగారి దర్శనయానంతో సాక్షిసంతకం చేస్తుంది. అవును, 'కాలగీత'లా ఇది కాలదర్పణం; వర్తమాన, గతకాల దర్శనం. బింబాలతో సహచరణం చేసిన సూరంవారి చేవ్రాలు ఈ 'కాలగీత'.

"కాలానికి - కాళ్ళూ చేతులూ అతికించి -
బంగారు గొలుసులతో కట్టి - మట్టి కరిపించి -
వెనుదిరిగితే -
ఎప్పుడొచ్చిందో - ఎలా వచ్చిందో - ఏమో -
ఇటేపు ఇంతెత్తున నిలబడి - వికటంగా అటిస్తోంది -
కాళ్ళూ లేవు చేతులూ లేవు - కట్టిన గొలుసులూ లేవు"

వర్తమాన దర్పణంలో సూరంకవి దర్శనం ఇది. పచ్చబొట్ల పరిహసనాన్ని పలుకులుగా ప్రతిధ్వనించిన కవితాభివ్యక్తి ఇది. ఈ మానవ అభివ్యక్తికి

"మీ తాతల తాతల తాతల తరాలనుండీ
పుట్టుమచ్చలో పెట్టుమచ్చలో
ముచ్చటగా పెట్టి మురిసిపోతూనే ఉన్నా
నువ్వెంత? వసివాడని పసితనానివి"

అంటూనే "దర్భపోచతో తాకితేనే కారిపోయే రక్తానివి" అంటూ మానవ జన్మ అస్తిత్వాన్ని ధ్రువీకరిస్తూ

"ఎదురొచ్చిన కాలనాగునైనా ఎలా ఎదిరిస్తానో తెలుసా?
తన తనువును తానే ఒలుచుకొని కుబుసమై పోతుందది"

అంటూ కాలం తన అస్తిత్వ చిరంజీవత్వాన్ని చాటుకుంటుంది. మానవ కుప్పిగంతులను, మానని కప్పగంతులను తూర్పారపడుతూ "అన్నింటిలో అన్నింటితో అదృశ్యంగానే నా ఉనికి" అని స్వగతంగా తన ధీమాను వ్యక్తపరుస్తూ

"నా అవసరం లేనిదీ - నేను ఆధారం కానిదీ - ఒక్కటి చెప్పు -
నీ కాలిక్రింద చెప్పునై పడి ఉంటా ..."

అంటూ నీకూ - నాకూ - మనందరికీ ఒక పెనుసవాలు విసిరి సూరం శ్రీనివాస కవి ముప్పైమూడు 'కాలగీత'ల్లోనూ "రెప్పపాటుకూ రెప్పపాటుకూ మధ్య విశ్వచైతన్యమై" విలసిల్లుతుంది.

ఈ కాలచైతన్యం తనలోకి తాను చైతన్యవాహినిగా మూలాల్లోకి ప్రవహించే దిశలో, దశలో -

"ఉండచుట్టుకొని ప్రారంభించా నా జీవితాన్ని
ఎప్పుడంటే చెప్పలేను
మీకెంత తెలుసో నాకూ అంతే తెలుసు"

అంటూ వాస్తవాన్ని గ్రహించి వర్తమానంలోనే తన వర్తనాన్ని మానవ వర్తనంతో పోల్చుకుంటూ - తన అస్తిత్వాన్ని నిరూపించుకుంటూ - "ఒక్క ముడీ లేదు ఒక్క చిక్కూ లేదు" అంటూ తన పారదర్శకత్వాన్ని చాటుకుంటూనే - "కొన చూడాలని ఉండ విప్పుతూనే ఉన్నా / ఇప్పట్లో ముగిసేట్టూ లేదు" అంటూ మన సూరంకవి కలం కాలమై - దీర్ఘకవిత్వమై -

"కొన కానవస్తే అట్నుంచీ చుట్టుకొచ్చి
మొదలు కనుక్కోవచ్చని ఆశ
ఆ ఆశా తీరేట్టు లేదు"

అంటూ కావ్యాంత అవలోకనంలో తన లోగుట్టును పదిలపరచుకుంటుంది.

కాలానిది కులుకు ... నడక. కాలాన్ని లెక్కించే మనిషిది పరుగు ... ఉరుకు. అందుకే నడిచొచ్చే కాలం ముందు ఎవరైనా, ఏదైనా బలాదూరే. కారణం - తనను బంధించే త్రాళ్లను తాను కూడా ఇంకా పేని చూడలేదు - అన్న ఇంగిత జ్ఞానం కాలానికి ఉంది. లేనిదల్లా మనిషికే అన్న చురక సూరంవారి ఈ కవితా వాక్యంలో కాలనేతలా కానవస్తుంది. అసలు, ఉత్తరాయణ దక్షిణాయణాలు అంటూ కాలగతిని ఇరుపార్శ్వాలలో చూసే మనిషికి అవి తన ముఖాలు కావు - దినకరుడి నడకలు - అంటూ స్పష్టం చేస్తూ; ఊర్ధ్వ, అధోగతుల పరిగణన లేని పురోగమనమే తనది అని తన నిరంతర యానాన్ని మనముందు ఉంచుతుంది ఈ కాలనేత్ర.

"నేనెక్కడుంటానో మీకు తెలియదు
నేనెక్కడ లేనో నాకు తెలియదు"

అంటూ తన అనంత నిజ అస్తిత్వ విస్తృతిని ప్రకటించుకున్న కాలం

"యుగయుగాలుగా నేను నడుస్తూనే ఉన్నా
ఒక్క యుగమైనా
ఆగి ఆనందించే అవకాశ మివ్వకపోతుందా"

అని వాపోతూ, మానవ యుగ చరిత్రపై ఒక వ్యంగ్యాస్త్రం విసిరి

"తరతరాలుగా అన్వేషిస్తూనే ఉన్నా
ఒక్క తరమైనా
నన్ను పూర్తిగా మన్నించకపోతుందా"

అని మనతరం మరతనం జబ్బ చరుస్తూనే మరో చురక వేస్తోంది.

తర్డ్ డైమెన్షన్ నుంచి ఫోర్త్ డైమెన్షన్ లోకి పరిణమిస్తున్నామన్న పరిగణనలో ఉన్న మనల్ని

"మూడో పార్శ్వాన్ని
ముక్కలు చేసి చూడటమే - ఇంకా నేర్చుకోని మీరు
నాలుగో పార్శ్వంగా
నన్ను లెక్కేసుకుంటూ - ఇంకేదో వెతుకుతారెందుకో?"

అంటు కాలం తన భ్రుకుటి ముడివేసి

"హద్దులు మీరి అలమటించే మీరు
ఎంతెత్తు ఎదిగారని ఇంకో అన్వేషణ"

అంటూ ఒక ప్రశ్నపత్రంలా ఒక భవిష్యచిత్రపటాన్ని మనముందు ఉంచుతోంది. ఈ రేపటిలో

"అసలెంతో మరచిపోయిన బాకీని
వడ్డీ కడుతూనే కడుతూనే ఉండాలి ..."

అంటూ రాసుకోబోయే భవిష్యత్తరాల పుటలలో మనవి అసలు తీర్చలేని బాకీ బ్రతుకులే అంటూ హెచ్చరికలాంటి భవిష్యవాణిని పలుకుతోంది.

ప్రసాదంలోని కలకండపలుకులకూ , కలుపుకున్న జీడిపప్పుముక్కలకూ, పంచదారకూ, పాలగిన్నెకూ, కంచులోటాలకూ, ఖాళీచెంబులకూ అంటుకున్న భక్తివేదాంతతత్వం కాదు సూరంవారి కవిత్వతత్త్వం. వారి కలంనాలికకు, కాలనాలికకు భక్తీ అంటదు, వేదాంతమూ అంటదు. అందుకే -

"కాలాన్ని కాలదన్నితే / నెత్తిమీదకే ఎక్కుతుంది
కడుపు చించుకుంటే / కాళ్ళమీదే పడుతుంది"

అని తేల్చి చెబుతూ "గంతలు కళ్ళకా? వేవిళ్ళకా?" అని ప్రశ్నిస్తూనే - ఆ ప్రశ్నించటంలోనే తన సమాధానాన్ని అంతర్గర్భితం చేస్తారు - మన సూరంవారు. కాబట్టే వీరి కలం కాలాన్ని తొలుచుకుంటూ పురాణ ప్రస్తావనల్లో - 'ఒక పిండమే నూటొక్క సంతు' అయిన అసూయను చూడగలిగింది ... ఏడురోజుల్లో పాముకాటుకు భయపడి పదిదిక్కులనూ బంధించినతనంలో తెలివితక్కువతనాన్ని పైకితేగలిగింది ... అర్థంకాని అంపశయ్యలో పురోగమనమే తప్ప తిరోగమనంలేని కాలజ్ఞానాన్ని పసిగట్టలేని ఔచిత్యాన్ని ప్రశ్నించింది.

"శివలింగాన్ని మీరు చుట్టుకున్నా
మృత్యువును ఆపగలిగింది నేనే"

అన్న ధీమా సూరంవారి కాలానిది. అంతేకాదు "నాతోనే నడవండి ... నాతోనే కదలండి ... నాతోనే లేవండి ... నాతోనే పాడండి ... నన్నే అనుసరించండి" అంటూ తనచుట్టూ మానవతత్వాన్ని చుట్టుకుంటూ తన అస్తిత్వాన్ని కాపాడుకుంటూ,

"క్షణం ఆలస్యం చేసినా
ఇక మీరు లేనట్టే ... గుర్తుంచుకోండి"

అంటూ హెచ్చరిక జారీచేస్తూ, తన పెద్దరికాన్ని చాటుకుంటూ ఉంటుంది. అంతేకాదు

"మసిబట్టలకు పట్టిన మసిలో
నుసినుసి నవ్వులతో నేనుంటాను
ఉతకాలన్న ధ్యాస మీకుండదు
బ్రతకాలన్న ఆశ నాకు చావదు"

అంటూ మానవ చాదస్తానికి, భక్తికి పట్టిన మసిని వేలెత్తి చూపిస్తూ మనకు లేని ధ్యాసలో తన బ్రతకాలన్న ఆశను చూసుకుంటుంది. అలా తాను ఆశ పడుతూనే

"కురిసిన మబ్బులే మళ్ళీ కురవాలనీ
రేపటి మొగ్గలూ ఈపూట విరియాలనీ"

కాంక్షించే మనిషిది మాత్రం అత్యాశ అంటూ ముద్ర వేస్తూనే ఒక వెక్కిరింపును మానవతనానికి అతికిస్తుంది. అందుకే నడుస్తున్న మానవ మానవమేధకు

"అగ్నిజ్వాలలూ అర్థం కావు
ఆషాఢమేఘాలూ అర్థం కావు"

అంటూ తీర్పును ఇచ్చేస్తుంది.

అసలు, సూరంవారి 'కాలగీత' "నిరంతర నిరంతర ఋజుగీత". అందుకే

"అమావాస్య చీకట్లలో
అలవికాని క్షుద్రశక్తులకోసం
పున్నమి వెన్నెలదారుల్లో
బులుపెక్కిన దివ్యవిద్యలకోసం"

మానవజన్మలు ఆత్మ రూపేణా చేస్తున్న ఆధ్యాత్మిక విన్యాసాలపై 'కాలగీత' నిండా సూరంవారి చురకలు మెండు. ఇంతటితో ఆగక -

"సంసారమైతే నేం? సన్యాసమైతే నేం?
రెండూ వెంపర్లాటలేగా!"

అంటూ తాను విస్తుపోతూ

"నువ్వైతే ఏం? నేనైతే ఏం?
రెండూ అహంకారాలేగా!"

అంటూ మానవ ఆభిజాత్యాన్ని నింగికెగసేలా చేసి "ఎచ్చులకు పోయి నన్ను ఎత్తుల్లో చూడకండి" అంటూ తాను మహిమాలయంగా ఎదిగి మన ఎచ్చులను లోయల పాలు చేస్తుంది.

మానవాళిలోని కార్తాంతికులు, దైవజ్ఞులు, భూతవైద్యులు, దార్శనికులు, దగాకోరులు, మూలవిరాట్టులు, ఉత్సవవిగ్రహాలు ... ఇలా అందరూ, అన్నీ కాలాన్ని కబళించాలని నిరంతరం శ్రమిస్తున్నా కాలం మాత్రం "వాళ్ళూ బ్రతకాలిగా అన్న వజ్రకఠినభావం"తోనే మానవ 'ఆశ'కు 'శ్వాస' అయి 'కాపు' కాస్తూనే ఉంది. అంతేకాదు

"కాలంతో సవాలు విసిరి / ఎడారిలో గింజలు నాటినా
కాలం తీరే గింజలవైపు / కనికరంతో చూస్తా"

అంటూ నిత్య సత్య ప్రమాణం చేస్తోంది.

"నేనే నిన్ను నడిపిస్తా జడిపిస్తా
నేనే నిన్ను అదిలిస్తా బెదిరిస్తా
నేనే నిన్ను కరుణిస్తా అలరిస్తా"

అనే నవమానవ 'మొనగాడికోసం' ఎదురుచూస్తోంది.

"చేత్తోనే ఎందుకు రాయటం?
నోటితోనూ ప్రయత్నిద్దాం
నోటితోనే ఎందుకు తినటం?
మరో మార్గం అన్వేషిద్దాం"

అనే నవనవోన్మేషశీలి మన సూరంకవి. "భయం నుండే భాష్యం పుడుతుంది" అన్న ఎరుక కలిగిన శ్రీనివాసులుగారికి "భాష్యాలు పెరిగేకొద్దీ భయాలు పెరుగుతుంటాయి" అన్న వర్తమాన స్పృహ వలసినంత ఉంది. అంతేకాక " బ్రతుకు వేరే బలహీనత వేరే / భయం వేరే భంగపాటు వేరే" అనే వివేక పటిమా మెండుగా ఉన్నవారు ఈ కవి శ్రేష్ఠులు.

"రేపటి రూపాన్ని ఈరోజే నిరూపించి
పంచాంగాల పేరుతో / పబ్బం గడుపుకుంటున్న"

నేటి నడుస్తున్న చరిత్రను నిబ్బరంగా, నిర్భయంగా తూర్పారబట్టగల నిశ్శబ్ద విప్లవ కవి మన ఈ సూరంకవి.

"నా స్థితికి పురఃప్రవృత్తికీ
తిరోగతి గానీ తిరిగి చూడటం గానీ
నా పద్ధతీ కాదూ నా పరిణతీ కాదు"

అని నిర్ద్వంద్వంగా ప్రకటించగల ధీరగంభీరుడు డా. సూరం శ్రీనివాసులుగారు. "నేనుంటేనే మీరన్నది నిజం / మీరుంటేనే నేనన్నది పచ్చినిజం" అని నిక్కచ్చిగా చెప్పగలుగుతున్న కవి డా. సూరం శ్రీనివాసులు.

ఈ వర్తమాన అభ్యుదయ కవి కవితా వర్తనం గురించి సరికొత్తగా చెప్పుకోవాలంటే వారి 'ముద్ర'ను గురించే. ఈ కవి "మీకు మాత్రమే ... మీకు మాత్రమే", "కడుతూనే ... కడుతూనే", "రెప్పపాటుకూ ... రెప్పపాటుకూ", "చినుకుకూ చినుకుకూ", "అడుగుకూ అడుగుకూ", "నిరంతర నిరంతర" వంటి

పదాల పునరుక్తులతో చెప్పదలచుకున్న భావాన్ని, ఆ భావం చెరగని ముద్రను మనకు కనిపింపచేస్తారు. ఇక వీరి "పుట్టుమచ్చలు పెట్టుమచ్చలు", "కుప్పిగంతులు కప్పగంతులు", "నడకలూ కులుకులూ", "ఉరుకులూ పరుగులూ", "ఉతకాలన్న బ్రతకాలన్న", "ఎత్తిపొడుపుకూ ఎదురుదెబ్బకూ", "కారుణ్యమూ కార్పణ్యమూ", "గుయ్యారమూ ఒయ్యారమూ", "విలాసమూ వియోగమూ", "హతాలూ మతాలూ", "కర్తృత్వమూ భోక్తృత్వమూ", "ముంగిలా నంగిలా", "శృంగిలా భృంగిలా", "ప్రకల్పాలతో ప్రరోచనలతో" వంటి ద్వంద్వ పదబంధాలు ఈ కావ్యగీతను శబ్దమాధుర్యంతో అక్షరయానం చేయిస్తున్నాయి. అంత్యప్రాసలకైతే కొదువే లేదు ... పట్టుకోగలిగినవారికి పట్టుకోగలిగినన్ని.

"మసిబట్టకు పట్టిన మసిలో / నుసినుసి నవ్వులతో", "వంగి వత్తులైపోయిన / సింగారపు సింగిణిలా", "ప్రపంచవేదపు క్రమఘనజటలై / పరిసర జీవనఫలైక గతులై", "నిర్నిద్రకార్యాచరణ సంచరణాలతో / నిగమావృత గగనతలంతో", "చేపలవేట చివరికొచ్చేదాకా / కొంగైనా జపర్షే", "కాలం పండబారేదాకా మహర్షీ కిరాతకుడే", "కాలం చినుకు కళ్ళమీదనే కాటు వేస్తుందని" వంటి ప్రయోగాలలో ఉపమాన ఉపమేయాలు సంయోగించి సూరంవారి సంస్కృతాంధ్ర అభివ్యక్తితో మనల్ని కవితావాక్యాల వెంట చూపులను, ఆలోచనలను మరలింపచేయవు.

"మౌనం నుదుట రాసిన గీత"గా కావ్యప్రతిభా సంపన్నులైన డా. సూరం శ్రీనివాసులుగారు తమ 'కాలగీత'ను వెలార్చినా -

ఇది ఇసుక గడియారంతో కానీ, నీళ్ల గడియారంతో కానీ, నీడ గడియారంతో కానీ, గోడ గడియారంతో కానీ కొలవదగ్గ 'కాలగీత' కాదు. అక్షరాల ఉంగరాలతో రాసిన గీత. రెండు చరబిందువుల మధ్య నుండి వెలికివచ్చిన కాల యవనిక. శ్రద్ధతో, స్థిరబుద్ధితో - నిష్ఠతో, పరినిష్ఠతో - సూరం శ్రీనివాసులు కవిగా మనఃప్రసారాలనూ, బుద్ధివికాసాలనూ, భావప్రకాశాలనూ, ధ్యానవిధానాలనూ, గానవినోదాలనూ, జ్ఞాననినాదాలనూ గమనించి అక్షరీకరించిన కాలకొలమానం ఈ 'కాలగీత'.

అంతేకాదు - "పనులలో ధ్వనులలో - పలుకులో కులుకులో - నడకలో నడతలో - కదిలే ఆకులో - పరిధి పెంకులో - మబ్బుల మజిలీలలో - నురగల జలీకృతిలో – పోటెత్తిన వయస్సులో – కాటుపోయిన పయస్సులో కాలాన్ని కొలిచిన అనుపమాన తీరు ఈ 'కాలగీత'ది. "రాగాల్లో, భోగాల్లో, జపాల్లో, తపాల్లో, తేనెలో, సోనలో, కునుకులో, కసువులో కాలం కదలికలను చూసి, పదచిత్రాలలో అక్షరరమ్యతను లెక్కతేల్చిన 'కాలగీత' ఇది.

"కాలి అడుగుల లెక్కకన్నా
ఖచ్చితమైన గడియారం ఉందా?
కార్యశీలియైన కరం కన్నా
కాలం కొలతకు ఉపకరణముందా?"

అంటూ కాలంతో కాలం వెంటపడ్డ కవితాక్షరశోధకుడిగా సూరం శ్రీనివాసులుగారి సరికొత్త అంతర్యానం మనముందు పరచుకోబోతున్న ఈ 'కాలగీత'.

న్యూజెర్సీ — **– విశ్వర్షి వాసిలి**
12.12.2022 — (డా. వాసిలి వసంతకుమార్)
సెల్ : 9393933946

కాలానికీ కవిత్వానికీ చైతన్యం

– మెట్టు రామచంద్ర ప్రసాద్

కాలానికి గీసిన పెద్ద వచన కవితా గీతము ఈ గీత. కాలమనే బృహద్వీణను మీటుతూ పలికించిన సుస్వర సంగీతమే ఈ గీత. కాలంపై పలు రంగులద్ది గీసిన గీతల సమాహారమే ఈ గీత. కాలమనే బండపై ఉలులతో మలచిన శిల్పకళా-ఖండమే ఈ గీత.

ఈ కాలగీత నిడివి చాలా పెద్దది, కాలంపై ఇది ఒక దీర్ఘ కవిత. సంస్కృతాంధ్ర భాషా నిష్ణాతులైన డాక్టర్ సూరం శ్రీనివాసులు గారు పుట్టుకతో వచ్చిన ప్రతిభతో పాటు నిరంతర పరిశ్రమతో వ్యుత్పత్తిని నిండుగా సంపాదించుకొని, దానికి ఎడతెగని అభ్యాసంతో బహువిధ సాహిత్య ప్రక్రియలలో తన కవితాఝరిని ప్రవహింపచేశారు. వారి రచనలన్నీ ఆలోచనామృతాలే.

వినత – బుసపురుగులు – భీష్ముడు – అంబరీషుడు, దుర్వాసుడు – అనసూయ – సైంధవుడు - సమవర్తి - శకుని, నల మహారాజు - హరిశ్చంద్రుడు, ధర్మరాజు - కృష్ణుడు, ఉత్తర కుమారుడు – అర్జునుడి రథము, గాండీవము - అనూరుడు, సూర్యుడు - కచుడు - వ్యాసుడు, సుమశరుడు - విశ్వామిత్రుడు - వసుదేవుడు, రామబంటు - సాగరము, సగర సుతులు - పరీక్షిత్తు, శృంగి శాపం, తక్షకుడు – అర్జునుడు - సహదేవుడు - పృథ - మాంధాత – నటరాజ - ఇలాంటి కావ్యేతిహాస పురాణ గాథలన్నీ తెలిసి ఉంటే గాని సూరం వారి కాలగీతలో ఆయా పాత్రల ప్రసక్తి అర్థం కాదు.

1) "పుట్టినదాదిగా బింబాలతో సహచరణం చేస్తూ, నీడలకు మాత్రం గులాంగిరీ నటిస్తూ" ఉన్న కాలాన్ని వర్ణిస్తారు సూరం వారు. దానికి "కట్టిన గొలుసులూ లేవు" అని ఈ భావకవి ముక్తాయింపు. మనకు తెలిసిన విషయాన్నే ఎంతో సుందరంగా ఉత్ప్రేక్షిస్తారు సూరం వారు. కాలం ఏమంటున్నదో చూడండి - "ఎదురొచ్చిన కాలనాగునైనా!, ఎలా ఎదిరిస్తానో తెలుసా?, తన తనువు తానే

ఒలుచుకుని, కుబుసమై పోతుందది, తన బ్రతుకు తానే ఈడ్చుకుంటూ, చెట్టూ పుట్టా పట్టుకు పోతుందది". ఇలాంటి ఉత్ప్రేక్షలు ఈ దీర్ఘ కవితలో ఎన్నో. ఈ గీత దాటాలంటే ఎంతో ప్రాచీన సాహిత్య సంపద పాఠకునికి చాలా అవసరం. ఈ గీతకు వ్యాఖ్యానం వ్రాయాలంటే ఇంతకు నాలుగింతలు అవుతుందేమో.

2) "గంతలు కళ్ళకా వేవిళ్ళకా?" అంటూ గాంధారిని, ఆమె సంతతిని వర్ణించిన విధానం చూడండి.

3) "ఇంకా ఎందుకీ కంచి గరుడ సేవలు?, ఎవరి దిష్టి తగిలిందని ఎర్రన్నపు ముద్దలు?" ఇలాంటివి తెలియాలంటే తెలుగు నుడికారము, మన ప్రాచీన ఆచార వ్యవహారములు తెలిసి ఉండాలి. "అనసూయ మాత్రం, ఆపింది దినకరుణ్ణే నన్ను కాదు", "ముందుకే సాగుతుంటా", ... "వేగంలో మార్పు ఉండదు, ఆగటమంటూ అసలే ఉండదు" అంటుంది కాలం. నిజమే, కాలాన్ని బంధించేవారు, దాని ఆద్యంతాలు తెలిసినవాళ్లు ఎవరున్నారు చెప్పండి.

4) "కాలం పరిగెడుతోందని నామీద ఆరోపణ" కొందరిదైతే, "కాలం గడవట్లేదని నా మీద నిష్టూరాలు" మరికొందరివి. ఇదంతా కాలానిది కాదు, వారి వారి అప్పటి మనస్తత్వానిదే కదా.

5) "శిశిరానికీ వసంతానికీ మధ్య, ఆకులతో పాటు, రాలుతున్నది నేనే" - ఇది కాలం గీసిన గీత. "కాలం మారిపోయిందంటారు", "పిదపకాలపు బుద్ధులంటూ, నామీదనే పెద్ద అభాండం" అని కాలం కూడా ఈ జనాన్ని చూసి వాపోయేట్లు చేస్తారు సూరం వారు. ఏదీ శాశ్వతం కాదు, అయినా "చిరంజీవుల మంటూ కొందరు, అక్కడికక్కడే ఆగిపోయినా, మోస్తూనే ఉన్నానుగా, తలకు మించిన భారమైనా" అంటుంది కాలం.

భూత భవిష్యత్తులను వర్తమానంలోకి తేవాలంటే ఎలా? "ఇంకా ఎందుకు వత్తిడి చేస్తారు, కురిసిన మబ్బులే మళ్లీ కురవాలనీ, రేపటి మొగ్గలూ ఈ పూటే విరియాలనీ" అంటూ నిలదీస్తున్నది కాలం. అలా వత్తిడి చేస్తే ఎలా. ఇది జరిగే పనేనా.

7) "నేలలో లావ, నీటిలో బడబ, అడవిలో దావ, ఇంకెక్కడ దాక్కోగలరు, నా ఒడిలో తప్ప" అన్న కాలం మాట ఎంత రమణీయార్థ ప్రతిపాదక శబ్దమో. "విశ్వరూపాలు చూసి, విస్తుపోయే మీకు"... "ఎప్పటికీ తెలీదు" ఇది కాలమహిమ. అంటారు ఈ కాలగీతకవి.

8) "బాగూ ఓగూ మీరు గీచిన గీతలు, నేను మాత్రం ఒకటే గీత, నిరంతర నిరంతర ఋజుగీత"అని తనేమిటో స్పష్టం చేస్తున్నది కాలం. "నువ్వైతే ఏం? నేనైతే ఏం?, రెండూ అహంకారాలేగా!" అని శంకరుని అద్వైతానికి భాష్యం చెప్తున్నదేమో కాలం.

13) "తక్షణ కాలబిందువులో, మీ ఉనికీ, పరివ్యాప్తీ ఎంత?, మిమ్మెరిగిన మనుజుల కథ ఎంత?" అని మానవజాతిని పరిహసిస్తున్నది కాలం. స్థిరాస్తులనే పదంలో డొల్లతనం ఇలా ఎండగడుతున్నది కాలగీత.

14) "నా శాశ్వతత్వం మీద నాకే అవిశ్వాసం"... "మీకు మాత్రం మీ స్థిరత్వం మీద, అలవిమాలిన విశ్వాసం, అందుకే మీకు స్థిరాస్తులుంటాయి". భగవద్గీతలోని మాట"కర్తృత్వమూ నాదే, భోక్తృత్వమూ నాదే". నిజమే. జనాలు "కాలక్షేపమే (క్షేపము = తిరస్కారము) లక్ష్యంగా, కలకాలం బ్రతకాలనుకుంటారు". ఇది ఎంత పరిహాసాస్పదం.

15) "కాలం మారదు, మనమే మారుతాం, దాన్ని కాలం ఖాతాలో వేస్తాం" అని కాలమెప్పుడూ ఒకేరీతిగా సాగిపోతుందని తెలియజేస్తారు సూరంవారు. వీరు స్వేచ్ఛకూ కట్టుబాట్లు ఉండాలి అంటారు. "దేనికీ కట్టుబడకుంటే, అది స్వేచ్ఛా ప్రియత్వమా?, రైలు పట్టాల మీదే నడవాలి, విమానం ఆకాశంలోనే ఎగరాలి" ఇది ముమ్మాటికీ నిజం. కట్టుబాట్లు లేని పరిపూర్ణ స్వేచ్ఛ మంచిది కాదుగదా.

కాలాన్ని కొలవాలని మానవుల్లోఎంత తాపత్రయమో తెలియజేస్తారీ కవి.16) "రేపటి నా రూపాన్ని ఈరోజే నిరూపించి, పంచాగాల పేరుతో, పబ్బం గడుపుకుంటున్నారుగా?" అని కాలం చేత చెప్పిస్తున్నారీ మాటలు.

18) “ఏ యోగమూ లేని, నిరంతర సంచారం నాది.”... అని కాలం చెప్తే, “కాలం కదులుతూనే ఉండాలి, లేకుంటే కలుషితమవుతుందది” అని సూరం వారు కాలాన్ని విశ్లేషణ చేస్తున్నారు.

27) “కాలం బలీయమంటూ, కాదంటే కలసి రాలేదంటూ” తమ తప్పులు మరచి, కాలాన్ని దూషించడం పరిపాటి అయిపోయిది ఈ జనాలకు.

29) కాలం ఆది మధ్యాంతరహితమూ, అనంతమూ అనే విషయాన్ని సూరం వారు ఎంత సరళ సుందర కవితగా తీర్చిదిద్దారో చూడండి. “ఉండ చుట్టుకొని ప్రారంభించా నా జీవితాన్ని” ... “ఒక్క ముడీ లేదు ఒక్క చిక్కూ లేదు, కొన చూడాలని ఉండ విప్పుతూనే ఉన్నా, ఇప్పట్లో ముగిసేట్టూలేదు, కొన కానవస్తే అట్నుంచీ చుట్టుకొచ్చి, మొదలు కనుక్కోవచ్చని ఆశ, ఆ ఆశా తీరేట్టు లేదు” ...

30) “జనం కళ్ళు కప్పినంత తేలికా, కాలం కళ్ళు కప్పటం?” నిజమే కదా. బాగా చెప్పారు సూరంవారు.

కాలంలో చైతన్యముంది. కవితలో కూడా చైతన్యం ఉంటేనే అది జీవవంతం అవుతుంది. 33) “చైతన్యముంటేనే, అందమైనా చందమైనా, స్పందన లుంటేనే, కవితైనా భవితైనా”... “కదలిక ఉంటేనే, కాలమైనా గోళమైనా” చివరి మాటగా చెప్పాలంటే సూరం వారి కవితా చైతన్యం ఓ జీవనదిలా నిరంతర కాలగీతలా ముందుకు సాగిపోతూనే ఉంటుంది.

సూరం వారి కవితా వైదుష్యాన్ని విడమరచి చెప్పగలిగే పరిపూర్ణత నాలో లేదు. ముందుమాటలో ఏదో కొంత వ్రాయడానికి ప్రయత్నించాను. పూర్తిగా తెలుసుకోవాలంటే “కాలగీత” ఒకటికి పదిసార్లు నిదానంగా చదివి మెండుగా నిండుగా అర్థం చేసుకోడానికి ప్రయత్నించండి. వారు ఎంతో ఆదరంగా చెప్పిన మాట కాదనలేక, వారి కాలగీతకు ముందుమాటలు వ్రాయడానికి యథాశక్తి ప్రయత్నించాను. వీరి కవితా చైతన్యం నిరంతరం కాలగీతలా సాగిపోవాలని ఆశిస్తూ...

నెల్లూరు — ***మెట్టు రామచంద్ర ప్రసాద్***

20.1.2023.

ఒకింత ముందుగా

కాలగేయం

ప్రాణి పుట్టుకనుండీ మరణం దాకా గడిచిన కాలాన్ని వయస్సు అంటాం. జగత్తు పుట్టుకనుండీ అంతమయ్యే దాకా గడిచే వయస్సును కాల మంటాం. వయస్సు వైయక్తికం. కాలం సామూహికం. అన్నింటికీ ఆధారం కాల మంటారు తార్కికులు. అంటే వసంతం వచ్చిందని చెట్టు చిగురించాలా? చెట్టు చిగురిస్తే వసంతం వచ్చినట్టా? దేనికి ఏది ఆధారం? ఈ క్షణం దాకా జరిగిన సంఘటనలకు కాలం ఆధారం. అది చరిత్ర. ఈ క్షణం నుండీ జరగబోయే కాలానికి ఘటనలు ఆధారం. అది భవిష్యత్తు. మన ఉనికియే కాలానికి భవిష్యత్తు.

ఒక అక్షరాన్ని పలికే సమయంలో సగం ఆదా చేసినా కొడుకు పుట్టినంత ఆనంద మట వ్యాకరణశాస్త్రవేత్తలకు. కాలాన్ని పొదుపు చేయటంలో వారే పితామహులేమో! కాలాన్ని లెక్కపెట్టుకోటానికి మనం సూర్యచంద్రుల గమనాన్ని ప్రమాణంగా తీసుకుంటాం. వాటి ఉనికి మనమనికికి మార్గదర్శనం చేస్తుంది కాబట్టి. ఎంతటి వాణ్ణి అయినా కట్టిపడవేయగల శక్తి కాలానికే ఉంటుంది. ఎంత గట్టి బంధాలనైనా విడిపించగల చొరవ, చాకచక్యం కాలానికే ఉంటాయి. అందుకే తార్కికులు అలా మనసు పడ్డది.

కవిత్వమో కావ్యమో వ్రాస్తూ కాలప్రసక్తి తీసుకొనిరాని కవులు పాతవాళ్ళలో దాదాపు ఉండరు. అది దాని శక్తి. దానికి పర్యాయంగా విధినైనా తలచుకోక మానరు. కవులు మాత్రమేనా? సాధారణ జనుల వాగ్వ్యవహారంలోనూ కాలస్పర్శ తగులుతూనే ఉంటుంది. ఇదంతా కాలాన్ని గురించి మనం చెప్పుకునే మాటలు.

ఆ కాలం తానెలా భావిస్తోందో? తానే ఆ నాలుగు మాటలూ చెప్తే ఎలా ఉంటుందో? ఆ ఆలోచనలు తెలుసుకోవాలనో, ఆ మాటలు వినాలనో మనసుపడే వారికోసం అందుబాటులో ఈ "కాలగీత".

కాలం నాతో చెప్పించిన మాటలివి. మీతో మరోలా చెప్పించవచ్చేమో? అందుబాటులో ఉంటే అవీ విందాం. అవీ తెలుసుకుందాం.

కాలగీతను ఆమూలాగ్రంగా పరిశీలించి "సూరం వారి కాలనేత" పేరుతో మున్నుడిని అందించిన విశ్వర్షి వాసిలి వసంతకుమార్ గారికీ, శ్రీ మెట్టు రామచంద్రప్రసాద్ గారికీ హార్దిక కృతజ్ఞతలు.

గ్రంథ ముద్రణకు ఆర్థికంగా పాక్షికంగా సహకరించిన చిరంజీవిని పాలపర్తి హవీలాకు, కాలగీతకు పుస్తకాకృతి కల్పించిన చిరంజీవి విట్టుబాబుకు శుభాశీస్సులు.

బెంగలూరు **సూరం శ్రీనివాసులు**

25-1-2023.

కాలగీత

1

పుట్టిన దాదిగా బింబాలతో సహచరణం చేస్తూ
నీడలకు మాత్రం గులాంగిరీ నటిస్తూ
ఆశల మీదా ఆశయాల మీదా
అదేపనిగా కత్తికట్టిన కాలానికి
కాళ్ళూ చేతులూ అతికించి
బంగారుగొలుసులతో కట్టి
మట్టి కరిపించి వెనుదిరిగితే
ఎప్పుడొచ్చిందో ఎలా వచ్చిందో ఏమో
ఇటేపు ఇంతెత్తున నిలబడి
వికటంగా అటిస్తోంది
కాళ్ళూ లేవు చేతులూ లేవు
కట్టిన గొలుసులూ లేవు

గొలుసు బిగించిన గాయాలు
మాయని మచ్చలై
కాలం కచ్చిపోతుతనానికి
సాక్ష్యాలవుతా యనుకుంటే
కాలం మచ్చలు నీ మీదా
నా మీదా మనందరిమీదా
పచ్చబొట్లుగా నిలిచి పరిహసిస్తున్నాయి
పలుకులై ఇలా ప్రతిధ్వనిస్తున్నాయి

మీ తాతల తాతల తాతల తరాలనుండీ
పుట్టుమచ్చలో పెట్టుమచ్చలో
ముచ్చటగా పెట్టి మురిసిపోతూనే ఉన్నా
నువ్వెంత? పసివాడని పసితనానివి
దర్భపోచతో తాకితేనే కారిపోయే రక్తానివి
ఎదురొచ్చిన కాలనాగునైనా
ఎలా ఎదిరిస్తానో తెలుసా?
తన తనువు తానే ఒలుచుకొని
కుబుసమై పోతుందది
తన బ్రతుకు తానే ఈడ్చుకుంటూ
చెట్టూ పుట్టా పట్టుకుపోతుందది

నన్ను చిక్కించుకొని చితక్కొట్టి
గుక్క తిప్పకుండా గొంతునొక్కేయాలని
కుప్పిగంతులు కప్పగంతులు ఎందరు వేయలేదు!
నేను చిక్కినప్పుడు గదా బంధించటం
అన్నింటిలో అన్నింటితో అదృశ్యంగానే నా ఉనికి
మీ పాలకూ పెరుగుకూ మధ్య నేనుంటా
నీటికీ తేటకూ మధ్య నేనుంటా
మాటకూ మనస్సుకూ మధ్య నేనుంటా
రెప్పపాటుకూ రెప్పపాటుకూ మధ్య
విశ్వచైతన్యమై నేనుంటా
నా అవసరం లేనిదీ
నేను ఆధారం కానిదీ
ఒక్కటి చెప్పు
నీ కాలిక్రింద చెప్పునై పడి ఉంటా... ❍

2

వినత ఘనతకు పోయి
నన్ను నిర్లక్ష్యం చేసింది
నేను క్షమించగలను కానీ
నా నైజం సహించలేదు
దాసిగా తాను మిగులుతున్నా
ఉదాసీనంగానే ఉండిపోయా

బుసపురుగులు తొందరపడ్డాయే గానీ
సందడి నాపలేకపోయాయి
వాటి ఆత్రాని కిచ్చిన విలువ
నా అస్తిత్వాని కివ్వలేకపోయాయి
నాలుకలు చీలిక లయ్యాయే కానీ
నా నైజాన్ని మించలేకపోయాయి

కాలాన్ని కాలదన్నితే
నెత్తిమీదకే ఎక్కుతుంది
కడుపు చించుకుంటే
కాళ్ళమీదే పడుతుంది
గంతలు కళ్ళకా వేవిళ్ళకా?
అసూయ అందలమెక్కితే
ఒక పిండమే నూటొక్క
సంతు అవుతుంది
అయినా నాకేం నష్టం

నేను నవ్వుకుంటూ ముందుకే సాగాను
ఏడురోజుల్లో పాముకాటంటే
పది దిక్కులూ బంధించాడే కానీ
క్షణమైనా నన్ను బంధించి
బ్రతకాలనే ఆలోచనే చేయలేదు
పరీక్షిత్తుకు తెలుసు
నన్ను బంధించే త్రాళ్ళను
నేను కూడా ఇంకా పేని చూడలేదని

ఊర్ధ్వగతి ఉత్తరాయణం
అధోగతి దక్షిణాయనం
అవి దినకరుడి నడకలే గానీ
నాదెప్పుడూ పురోగమనమే
అది అర్థం కాకనే అంపశయ్యకు
అన్నిరోజులు అగచాట్లయ్యాయి
నేను నడుస్తున్నా తాను ఆగి
అంబరీషుణ్ణి ఆగం చేయబోయాడు
దుర్వాసుడు.. అయినా ఏమైంది
నేను నడూస్తూనే ఉన్నా
తాను పరుగు లంఘించుకున్నాడు

నకరాలు చేస్తూ నాతో ఆడినా
నన్నే ఆడించాలనుకున్నా
నాకు మామూలుగా నడకలూ కులుకులూ
మీకేమో ఓపలేనంతగా ఉరుకులూ పరుగులూ... ❍

3

మూడో పార్శ్వాన్ని
ముక్కలు చేసి చూడటమే
ఇంకా నేర్చుకోని మీరు
నాలుగో పార్శ్వంగా
నన్ను లెక్కేసుకుంటూ
ఇంకేదో వెతుకుతారెందుకో?
కాలక్షేపపు కబుర్లు కాకపోతే
కూటికా? గుడ్డకా? వెతుకులాట

పొడుగు వెడల్పు కొలతలలోనే
పౌరుషాలు పొడుచుకొచ్చి
హద్దులు మీరి అలమటించే మీరు
ఎంతెత్తు ఎదిగారని ఇంకో అన్వేషణ

ఇద్దరు కుమ్ములాడుకుంటుంటే
ఆయుధాలు అందించేవాళ్ళూ
అవకాశముంటే అమ్ముకొనే వాళ్ళేగానీ
ఆగమనే వాడూ లేడు
ఆగమని అనగలిగేవాడూ లేడు
ఇంకా ఎందుకీ కంచిగరుడసేవలు?
ఎవరి దిష్టి తగిలిందని ఎర్రన్నపుముద్దలు?

నా రాకకు ప్రకృతి పులకిస్తుంది
తరువులు తలలు వంచుతాయి

సెలయేళ్ళు శివాలెత్తుతాయి
నాతో పోటీ పడి
చివురాకు పండబారుతుంది
పండుటాకు తత్త్వాలు పాడుతుంది
మీకు మాత్రమే ... మీకు మాత్రమే
నేనన్నా నా కదలికలన్నా భయం
కౌంట్ డౌన్ పెట్టుకొని మరీ
కదులుతుంటారు రాకెట్ కేంద్రాల్లో

అయినా మీలో అసూయలే గానీ
అనసూయ లెందుకుంటారు?
అనసూయ మాత్రం
ఆపింది దినకరుణ్ణే... నన్ను కాదు
ఆ ఇద్దరి పంతాలను ఆస్వాదిస్తూనే
నా మానాన నేను సాగిపోయా
ఒకరికి గతిభంగం ఒకరికి స్థితిభంగం
నాకు మాత్రం ఇద్దరూ పాథేయపానీయాలే

నేనొక వాహనాన్ని
చక్రాలూ ఉండవు
త్రిప్పటలూ ఉండవు
ముందుకే సాగుతుంటా
అటూ ఇటూ పరుచుకుంటూ...
వేగంలో మార్పూ ఉండదు
ఆగడ మంటూ అసలే ఉండదు
అసలెంతో మరచిపోయిన బాకీని
వడ్డీ కడుతూనే కడుతూనే ఉండాలి....

4

ఒకటి
రెండు
మూడు
నాలుగు
అయిదు
ఒకటిరెండుమూడునాలుగుఅయిదు
నేనంటూ లేకపోతే
అద్దం తిరిగినా కలపోతే
నా ఉనికివల్లే
నిటారుగా మీరు నిలిచేది
నా జోక్య ముంటేనే
మీరు చిరస్థాయిగా మన గలిగేది
నేనే లేకపోతే మీరు
మడత కూడా విప్పని గొంగళ్ళే
రెప్ప కూడా వాలని వెంగళ్ళే

నేను మామూలుగానే ఉంటా
కాలం పరుగెడుతోందని నా మీద ఆరోపణ
నేను మామూలుగానే ఉంటా
కాలం గడవట్లేదని నా మీద నిష్ఠూరాలు
మీ ఆందోళనలకూ
మీ ఆభిజాత్యాలకూ
ఆడిపోసుకోటానికీ

వాడి వదిలేయటానికీ
నేను మీకు కావాలి

యుగయుగాలుగా నేను నడుస్తూనే ఉన్నా
ఒక్క యుగమైనా
ఆగి ఆనందించే అవకాశ మివ్వకపోతుందా అని
తరతరాలుగా అన్వేషిస్తూనే ఉన్నా
ఒక్క తరమైనా
నన్ను పూర్తిగా మన్నించకపోతుందా అని

తరాలూ నడుస్తున్నాయ్
యుగాలూ గడుస్తున్నాయ్
నాతో పాటే అనుకుంటూ ముందో వెనుకో

మీ ఆలోచనలలో భాగస్వామిని నేను
మీ ఆనందాలకు ప్రత్యక్షసాక్షిని నేను
మీ ఆవేదనలకు గొప్ప ఓదార్పును నేను
నేనెక్కడుంటానో మీకు తెలియదు
నేనెక్కడ లేనో నాకు తెలియదు
నా కళ్ళకు గంతలు గట్టి
పట్టుకోమని మీరంటారు
మీ కళ్ళకు గంతలు లేకుండానే
నన్ను పట్టుకోలేక కుదేలవుతారు మీరు
అందరూ దొంగలే
దొరలకోసం అన్వేషణ
అందరూ దొరలే
దొంగలతో దాగుడుమూతలు

5

ఖరద ఎండి
పొలంలో నెర్రెలు పగలబడితే
వినయంగా వంగి
లోపలి పొరలలో నీటికై వెదికేది నేనే

తెగిపోయిన గాలిపటాల్లో
మిగిలి వ్రేలాడే తోకలా నేనుంటే
రెపరెపలే తల ఊపులుగా
అది ఔనౌనంటూనే ఉంటుంది

బిగుతైన మీ బట్టల మాటున
నేను బొద్దుగా దాగుంటాను
బట్టల నాడిపోసుకుంటారే గానీ
నన్ననే ధైర్యం మీకుండదు

మసిబట్టకు పట్టిన మసిలో
ముసిముసి నవ్వులతో నేనుంటాను
ఉతకాలన్న ధ్యాస మీకుండదు
బ్రతకాలన్న ఆశ నాకు చావదు

బంగారుపతకాలకూ
వెండిపతకాలకూ మధ్య
సూక్ష్మరూపంలో నేనే
తగిలిన గాయానికీ

మాయని మచ్చకూ మధ్య
వర్ణరూపంలో నేనే
శిశిరానికీ వసంతానికీ మధ్య
ఆకులతో పాటు
రాలుతున్నది నేనే

దేవుళ్ళనూ మారుస్తారు
పాతదేవుడి శక్తి తగ్గిందని..
కాలం మారిపోయిందంటారు
వేషమూ భాషా మారుస్తారు
మీ మనసుపడే ముచ్చట్లకోసం
పిదపకాలపు బుద్ధులంటూ
నా మీదనే పెద్ద అభాండం..
నువ్వు మారినప్పుడు ఏమైనా అన్నానా
నీ కొడుకు మారితే జోక్యం చేసుకోడానికి
మీ తరం విరగబడ్డప్పుడు ఏమైనా చేశానా
ఈ తరం తిరగబడితే
మీకు దన్నుగా నిలవడానికి

చిరంజీవుల మంటూ కొందరు
అక్కడి కక్కడే ఆగిపోయినా
మోస్తూనే ఉన్నానుగా
తలకు మించిన భారమైనా

ఇంకా ఎందుకు వత్తిడి చేస్తారు
కురిసిన మబ్బులే మళ్ళీ కురవాలనీ
రేపటి మొగ్గలూ ఈపూటే విరియాలనీ

6

నాతోనే నడవండి
ముందుగానే తలెత్తి
సైంధవుడిలా చావకండి

నాతోనే కదలండి
ముందుగానే పరుగెత్తి
పాలు ఒలికించుకోకండి

నాతోనే లేవండి
ముందుగానే లేచి
మళ్ళీ పడుకోకండి

నాతోనే పాడండి
ఆలాపనతోనే
అంతా అయిపోయి
గమకాల్లో
గుటకలు మ్రింగకండి

నాతోనే నటించండి
ముందుగానే
పరబ్రహ్మ మొదలెట్టి
అర్థాంతరంగా
తెరదించకండి

నన్నే చుట్టుకోండి
శివలింగాన్ని మీరు చుట్టుకున్నా
మృత్యువును ఆపగలిగింది నేనే

నన్నే అనుసరించండి
క్షణం ఆలస్యం చేసినా

ఇక మీరు లేనట్టే.. గుర్తుంచుకోండి ❍

7

పని గట్టుకొని రాళ్ళను కొట్టుకొని
నిప్పును నెత్తిన పెట్టుకున్నారు
ఇప్పుడు రవ్వ కనిపిస్తే చాలు
పారిపోయే మార్గాల వైపు
పరుగులు తీస్తూనే ఉన్నారు

అప్పుడూ ఇప్పుడూ
ఒకే ఆశ్చర్యం నాకు
మీరు
గుట్టుగా బ్రతకలేరు
రట్టు లేకుండా రాణించలేరు

నేలలో లావ
నీటిలో బడబ
అడవిలో దావ
ఇంకెక్కడ దాక్కోగలరు
నా ఒడిలో తప్ప...
అందుకే మీకు
అగ్నిజ్వాలలూ అర్థం కావు
ఆషాఢమేఘాలు అర్థం కావు

అయినా సరే
అగ్రులు చాస్తూనే ఉంటారు

అమావాస్య చీకట్లలో
అలవికాని క్షుద్రశక్తులకోసం
పున్నమి వెన్నెలదారుల్లో
బులుపెక్కిన దివ్యవిద్యలకోసం
అక్కడా ఇక్కడా కూడా
నా ఉనికిలో మలుపొక్కటే
నా తలపులో తగవొక్కటే

చినుకుకూ చినుకుకూ మధ్య
చిద్విలాసంగా మీరు నడవగలిగితే
అడుగుకూ అడుగుకూ మధ్య
అనంతలోకాలను దర్శించగలిగితే
త్రుటిలో తప్పిపోయిన పిడుగుపాటుకూ
వెంట్రుకవాసిలో తప్పించుకున్న మీకూ
మధ్యదూరాన్ని నిక్కచ్చిగా కొలవగలిగతే
నేనక్కడ కనిపిస్తాను
ఆకాశరూపంగా ఆత్మను మలుచుకుంటూ...

ఎత్తిపొడుపుకూ ఎదురుదెబ్బకూ మధ్య
ఎంత సుతారంగా ఒదిగిపోతానో
పొగకూ సెగకూ మధ్య
ఎంత సూక్ష్మంగా మిగిలిపోతానో
విశ్వరూపాలు చూసి
విస్తుపోయే మీకు
దండకాలు చదువుకుంటూ

ఊపిరి సలపని మీకు
ఎప్పటికీ తెలీదు

నేను జాలిపడి తట్టి లేపితేనే
నాతో మీరు నడవగలిగేది

నేనే ప్రమాన్పడి నడక నాపితేనే
మీరేంటో మీకు తెలిసివచ్చేది... ❍

8

ఆయనెవరో అన్నట్లు
"బాగున్నదంతా నేనే"
అని నేననను
బాగలేనిదంతా కూడా నేనే
కారుణ్యమూ నేనే
కార్పణ్యమూ నేనే
చీకటి గుయ్యారమూ నేనే
వెలుగుల ఒయ్యారమూ నేనే
విలాసమూ నేనే
వియోగమూ నేనే
వేసవిలో మండువేడిమీ నేనే
వర్షలో నిండువానలూ నేనే
ఆవూ నేనే పులీ నేనే
చావూ నేనే రేవూ నేనే

బాగూ ఓగూ
మీరు గీచిన గీతలు
నేను మాత్రం ఒకటే గీత
నిరంతరనిరంతరఋజుగీత
ఆశలూ ఆశయాలూ
మీరు పెట్టుకునే హద్దులు
నాది మాత్రం హద్దువైపు కదలబారడమే
పండుటాకులంటే మీకు జాలి
చివురుటాకులుంటే మీకు హోళీ

నాకు మాత్రం రెండు
నవ్యరసోదయసంకేతాలే
పరాక్రమమైతే ఏం? పారిపోవటమైతే ఏం?
రెండూ చేష్టలేగా
కరుణమైతే ఏం ? శృంగారమైతే ఏం?
రెండూ అనుభవాలేగా!
సంసారమైతే నేం? సన్న్యాస మైతే నేం?
రెండూ వెంపర్లాటలేగా!
నువ్వైతే ఏం? నేనైతే ఏం?
రెండూ అహంకారాలేగా!

వరదల్లో బురదమేటనూ నేనే
పనలనుండీ జారి రాలిన పరిగనూ నేనే
తేనెచుక్కనూ నేనే
కదలికతో కలిసి తేనెపట్టునూ నేనే

ఎచ్చులకు పోయి నన్ను
ఎత్తుల్లో చూడకండి
అసంతృప్తికి లోనై
అంతగానూ తూలనాడకండి
నేను సమవర్తిని
చదునుగా సాగుతూనే ఉంటాను
నేను చైతన్యశక్తిని
మీ కాలుసేతులలో కదులుతూనే
ఉంటాను...ఉంటూనే ఉంటాను..
లేకుంటే మాత్రం
కదలికకే కాలం చెల్లినట్టు...

9

రేపటి రూపాన్ని గురించి
మాపటి గమనాన్ని గురించి
నాకే స్పష్టత లేదు
ఆగుతానో సాగుతానో
ఆగితే
ఎక్కడో ఎప్పుడో ?
సాగితే
ఎందుకో ఏమిటో ?

అయినా
మీరూ
మీ కార్తాంతికులూ
మీ దైవజ్ఞులూ
మీ భూతవైద్యులూ
కాలం మీదనే కత్తులు నూరే
కరడుమెత్తని గుండెలవారూ
మీ దార్శనికులూ
మీ దగాకోరులూ
మీ మూలవిరాట్టులూ
మీ ఉత్సవవిగ్రహాలూ
కాలాన్నైనా కబళించాలని
కాలకూటాన్నీ ఛేదించేవారూ
రేపటి నా రూపాన్నీ
నాలో మీ రూపాన్నీ
కళ్ళకు కట్టిస్తారు

తప్పితే ఉరితీయండంటారు
ఉరే తప్పిపోతుందని
అచంచలవిశ్వాసం వారిది
వాళ్ళూ బ్రతకాలిగా అన్న
వజ్రకఠినభావం నాది
ఉదాసీనత నాది

రేపు అన్నది ఒక ఆశ
అందరికీ అవకాశ మిస్తుంది
కాపు అన్నది ఒక శ్వాస
అది కాలమే కల్పిస్తుంది

కాలంతో సవాలు విసిరి
ఎడారిలో గింజలు నాటినా
కాలం తీరే గింజలవైపు
కనికరంతో చూస్తా
ఆయుర్భావం మీద అవగాహనతో...
గాలిలోనే గిరికీలు కొట్టినా
పోతున్న ప్రాణాలకోసం
పరామర్శగీతాలు వ్రాస్తా
అంతే కానీ
నేను తిరుక్కోను
మీరు తిరుక్కున్నారని
నేను ఉడుక్కోను
దొరికిన చొక్కా తొడుక్కుని
దొరలాగా ముందుకే పోతా
కరిగిన మంచునూ కలుపుకొని
ఘనంగానే బ్రతుకుపాట పాడుతా...

10

నా అనుగ్రహమే లేకపోతే
శకునీ జూదంలో ఓడుతాడు
నలమహారాజు లాగా
హరిశ్చంద్రుడూ అబద్ధ మాడుతాడు
ధర్మరాజు లాగా

నా కనికరమే లేకపోతే
భీష్ముడూ మిగిలిపోతాడు
బ్రహ్మచారి లాగా
కృష్ణుడూ పారిపోతాడు
ఉత్తరకుమారుడి లాగా

నా సహకారమే లేకపోతే
అర్జునుడి రథమూ
అగ్గిపుల్లైపోతుంది
తిరుగులేని గాండీవమూ
తిమ్మిరెక్కిపోతుంది
నా మమకారముండబట్టే గదా
ఊరువులు పుట్టనివాడూ
సూరుని రథ మెక్కాడు
పానీయంలో ప్రాణాలు కలిసినా
కచుడు మళ్ళీ మొలకెత్తాడు

నాకన్నా ముందు నడిచే గదా
కాశినే శపించబోయింది
వ్యాసుడు కూడా
శివుణ్ణే రెచ్చగొట్టింది
సుమశరుడు కూడా

నన్ను నిలవరించాలనే గదా
సుదర్శనానికి జడిసి పరుగెత్తింది
దుర్వాసోముని
త్రిశంకుడికీ స్వర్గాన్ని సృష్టించింది
విశ్వామిత్రధుని

నేను స్తంభించినట్టు నటిస్తేనే
యమున పాయలై
వసుదేవుడికి దారి ఇచ్చింది
నేను కుంభించినట్టు హాఠిస్తేనే
విశ్వమంతా కదిలివచ్చి
రామబంటుకు వరాలిచ్చింది

కాలం కలిసిరాకనే
జింక వలలో చిక్కేది
కాళ్ళు లేక కాదు
కాలం కరుణ లేకనే
కళ్ళు నెత్తికెక్కేది
కలిమివల్ల కాదు

11

జారుతూ ఆగామో
ఎక్కుతూ జారామో
ఎంత గింజుకున్నా
ఎందుకు తెలీటం లేదో
మధ్యలోనే మనుగడ
ఎక్కాలేకా దిగాలేకా
నిరంతరచింతాక్లిష్టత

అనుకుంటున్నారు కదూ మీరు

పక్షి ఎంత ఎత్తు ఎగిరినా
వాలి విశ్రమించేది నేలమీదే
జలం జలధరమై
కొండల నెత్తి కెక్కినా
కురిసి మురిసిపోయేది
నేలలోతుల నీడల్లోనే
దేవతలు ఖేచరులైనా
శప్తులో పరితప్తులో అయి
సేదదీర వచ్చేది
భూతలవనాంతరాల్లోనే

నన్ను చూడండి
ఎక్కాలన్న కోరికా లేదు

జారుతానన్న భయమూ లేదు
ఎప్పుడూ ఒకలా ఒకేలా
చతురస్రంగా ముందుకే సాగుతుంటాను

పరుచుకోవటం నేర్చుకోకుండా
పరువులు తీస్తూ ఉంటేనే
హెచ్చుతగ్గులూ మిట్టపల్లాలూ
జారడాలూ జారుడుబండలూ..
కాలమై కబళించగలిగితే
మీదికాని దేముందని
ముందూ వెనుకా ఆరాటాలూ..
కాలాన్నే కబళించాలంటే
మీదంటూ మిగిలేదేముందని
నిరంతరం ఘర్షణలూ పోరాటాలూ

ముక్కునే దిక్సూచి చేసుకొని
ముందుకే సాగుతుంటే
కాలం మీ ప్రక్కనే
కలవరపాటుతో నిలుస్తుంది
తనకూ పోటీ తగుల్తుందన్న బెంగతో
అయినా మీరు
ముక్కునైనా వంకరత్రిప్పుకుంటారు కానీ
ముందుకు సూటిగా నడుస్తారా?

12

నాకన్నీ తెలుసు
నాకందరూ తెలుసు
మీ హతాలూ తెలుసు
మీ మతాలూ తెలుసు
బడాయికి పోకుండా
గుండె మీద చెయ్యేసుక చెప్పండి
మీలో ఎందరు సుఖంగా ఉన్నారో

సుఖభ్రాంతిలో కొందరు
సుఖనటనలో కొందరు
దుఃఖప్రధ్వంసాభావంలో కొందరు
సుఖప్రాగభావంలో కొందరు

విధిలేక బ్రతుకుతూ కొందరు
విధిగా బ్రతుకుతూ కొందరు
ఉన్నచోటు నుండీ కదలక కొందరు
కదిలి ఏం చేయాలో తెలియక కొందరు
నాతో పాటు నడుస్తున్నారే కానీ
నాలా నిర్లిప్తంగా ఉన్నవారెందరు?
నాలా నిశ్చలంగా
నడుస్తున్నవారెందరు?
నాలా మూడుముక్కలైనా
నలగనివారెందరు?

తమను తాము మోసంచేసుకుంటూ
పరానుసంధానం కాదులే అని
పరవశించిపోతూ
సామాజికసూక్తిరత్నాకరంలో
తానూ మరో రెండు రత్నాలను విసురుతూ...
(ఏరుకోవట మెప్పుడో మరిచిపోయాం)
పెదాలపై నవ్వులు పూసుకొని
గుండెల తలుపులు
గుట్టుచప్పుడు కాకుండా మూసుకొని
నేను చూస్తున్నంతసేపూ
గోడమీది మూడోవాడిలా నా వంకే చూస్తా
కొంచెం ముందో వెనుకో అయితే
పళ్ళు పటపట కొరుకుతూ
పెదవి చిట్లితే నెత్తురుపరీక్షకై పరుగెత్తుతూ
ఎడద బెదిరితే ముని వ్రేళ్ళతో రుద్దుకుంటూ
నేను కలిసి రాలేదని నన్ను ఆడిపోసుకుంటూ
ఎంతకాలం ఈ మేళం, మీ తాళం ?

నా కాళ్ళకు బంగారుసంకెళ్ళు వేసి
నా గమనాన్ని నిట్టనిలవునా స్తంభింపజేసి
"నువ్వు నన్ను నడిపించటం కాదు
నేనే నిన్ను నడిపిస్తా జడిపిస్తా
నేనే నిన్ను అదిలిస్తా బెదిరిస్తా
నేనే నిన్ను కరుణిస్తా అలరిస్తా"
అనే మొనగాడికోసం
ఎంతకాలం నా ఎదురుచూపులు?
ఎప్పటికో ఈ కుంటికలల పంటలు?

13

జ్ఞానపీఠాలపై కెక్కినా
ఆస్కారులనే అందుకున్నా
పద్మాలను పదిలంగా
బుట్టలో వేసుకుగలిగినా
కోటికొక్కరికైనా
కొలమానాలు తెలుసా?
ఘనాఘనఘనకార్యాలను
కాలనాళికల్లో పదిలంగా దాచినా
పైకి తీసేవాడు దొరికితేనే
పగలబడిపోగలిగేది మీరు

నేను చూసీ చూడనట్టుపోతే తప్ప
తత్క్షణకాలబిందువులో
మీ ఉనికీ, పరివ్యాప్తీ ఎంత?
మిమ్మెరిగిన మనుజుల కథ ఎంత?
ఉత్తరక్షణంలో ఊహల్లో కూడా మీ
ఉనికికి హామీ లేదు
నా కన్నా ముందుగా ఎక్కడికో పోయారే
మహామహులూ మహనీయులూ..
ఎక్కడికి పోయారో ఏమైపోయారో
ఇప్పుడన్నా ఎవరికైనా తెలుసా?
సాగరమే మిగిలింది తప్ప
సగరసుతు లేమమయ్యారో?

భారతమే మిగిలింది తప్ప
అష్టాదశ అక్షౌహిణు లేమయ్యాయో
చచ్చినోడూ లేడు చంపినోడూ లేడు

భయంతో భాగవతం వినటం కంటె
మనిషిగా మనవత్వాన్ని కురిపించి ఉంటే
పాపానికి ప్రాయశ్చిత్తం జరిగి
కాలమే స్తంభించేదేమో పరీక్షిత్తు కోసం
శృంగిశాపం విఘటించేలా
తక్షకుడు వెర్రిమొగంతో
పురుగుకన్నా హీనంగా పారిపోయేలా

అందరినీ ఒకేలా
అంతటినీ ఒకేలా
అలా తాకుతూనే
అడుగు కదుపుతుంటాను నేను
అర్భనాకారులకు అదే ఝంఝూవాతం
అందిపుచ్చుకునే వాడికి అదే సువర్ణావకాశం
తాకిడితోనే తనిసి తలవాల్చితే
త్రొక్కుతూనే పోతాను నేను

తగలగానే కదలికలై నాతోనే నడిస్తే
అనుభవాలన్నీ మీవే
ఆయుష్షు ఉన్నంతవరకు
ఖద్యోతాలూ ఖంజరీటాలూ మీవే
చేతన చిగురిస్తున్నంతవరకు... ❍

14

నా శాశ్వతత్వం మీద నాకే అవిశ్వాసం
ఏమీ లేకపోయినా నేనుంటానా?
నేనూ లేకపోతే ఇంకేమున్నట్టు?
మీ...కు మాత్రం మీ స్థిరత్వం మీద
అలవిమాలిన విశ్వాసం
అందుకే మీకు స్థిరాస్తులుంటాయి
నాలుగు గుంజలో నాలుగు రాళ్ళో
నాల్గువైపులా పాతగానే
అవి మీవైపోతాయేమిటో?
యుగాలనుండీ కాపాడుతున్న నాకు
మొండిచెయ్యే..
అవును. స్వాధీనం చేసుకోలేదుగా!
ఎవడో వచ్చి ఆక్రమిస్తే
క్షణంలో చరాస్తులై పోతాయి
ఆస్తులు ఒకడు అనుభవిస్తుంటే
కాగితాలు ఒకడు మోస్తుంటాడు
కంచె వేసేదొకడు
నిశ్చింతగా బ్రతికే దొకడు
నిన్న నువ్వు మొగ్గవు
ఈ రోజు పువ్వువు
రేపు కాయవు
ఎల్లుండి పండువు
చీకేస్తే టెంకవు

పారేస్తే కుంకవు
పండుదాకా ఎదిగించినా
టెంకను చేసి విదిలించినా
పులుపు తొలిగించినా
తీపి కలిగించినా
కర్తృత్వమూ నాదే
భోక్తృత్వమూ నాదే

పొలమారినా పలకబారినా
నా తాకిడి తగిలినట్టే
కల ఆగినా కలవరింతై సాగినా
మీరు నాతో చేయి కలిపినట్టే
ఏడు గజాల చీరను
ఎన్ని మడతలు పెట్టి కట్టినా
మడత మడతకూ మధ్య
విడిది చేసిన నన్ను
ఎలా తప్పించగలరు మీరు?
మడతలు పెరిగే కొద్దీ
మరీ చదునై పోతుంటాను నేను
మీ ప్రాణమైనా మానమైనా
నేను తలచుకుంటేనే రక్ష
ఇలా అంటాననే కదా
నేనంటే మీకు కక్ష?
అందుకేనా.. కాలక్షేపమే లక్ష్యంగా
కలకాలం బ్రతుకాలనుకుంటారు

15

కాలం మారదు
మనమే మారుతాం
దాన్ని కాలం ఖాతాలో వేస్తాం
మన ఖాతాలో వేస్తే
ఘనపరిణామాలకు
ఘనంగానే బాధ్యత
మనమే వహించాలిగా!
నీళ్ళు పల్లానికి జారితే
బాధ్యత నీళ్ళదేగా?
భూమికేం పని?

మారుదాం
ఎంతకాలం ఇలా
ముంగిలా నంగిలా
గడ్డితినే శృంగిలా
ఎగరలేని భృంగిలా
వంగి వత్తులైపోయిన
సింగారపు సింగిణిలా..
నిప్పుకణికను నీళ్ళలో పెట్టి
చల్లబరిచి నంజుకుందాం
పిండివడియాలను నానబెట్టి
పిసికి పిప్పి చేసుకొని మజాచేద్దాం
చీకట్లో చిదుగులేరుకొని

వెలుగువేళ వెలిగించుకుందాం
చేత్తోనే ఎందుకు రాయటం?
నోటితోనూ ప్రయత్నిద్దాం
నోటితోనే ఎందుకు తినటం?
మరో మార్గం అన్వేషిద్దాం.

నాకెరుక లేదు కానీ
మగనెమళ్ళు కలిసి కాపురం చేస్తాయా?
నాట్యం చేస్తాయి కానీ!
చాపలం వేరే సిద్ధాంతం వేరే
బ్రతుకు వేరే బలహీనత వేరే
భయం వేరే భంగపాటు వేరే
అసమర్థత ఆవిష్కరణా కాదు
బలహీనత కొత్తశాస్త్రమూ కాదు

తరాల తలరాతలు మారవచ్చు
కానీ రాత మాత్రం తలమీదనే
గీత ఎవరైనా గీయవచ్చు
ఆధారం మీదనే .. ఆకాశంలో కాదు
అటునుంచీ ఇటు నడిచినా
ఇటునుంచీ అటునడిచినా
బాటలోనే కానీ
బాహాటపు అడవిలో కాదు
పొలంలో పంట ఇంటిలో వంట
తారుమారైతే
ఉభయభ్రష్టత్వం ఉపరిసన్యాసం

దేనికీ కట్టుబడకుంటే
అది స్వేచ్ఛాప్రియత్నమా?
రైలు పట్టాల మీదే నడవాలి
విమానం ఆకాశంలోనే ఎగరాలి
విపరీతకటిబంధనాలైతే మాత్రం
విలయాలూ వెక్కిరింతలూ....

జీవితంలో ఎవరి భయం వారిది
జీవితానికి ఎవరి భాష్యం వారిది
భయంలో నుండే భాష్యం పుడుతుంది
భాష్యాలు పెరిగే కొద్దీ
భయాలూ పెరుగుతుంటాయి
చట్టాలు సంరక్షించినా
ధర్మం దారితప్పావనే అంటుంది. ❍

16

ఒక ప్రభాతాన
ఉషః కిరణాలను
దోసిళ్ళతో పుచ్చుకుంటూ
ఇసుకతిన్నెల బంగారు శయ్యలమీద
అలా అలా అలసటలు తీర్చుకుంటూ
మీలో మీరు తన్మయులై
పెరుగుమీది మీగడలా
మత్తుగా మాగన్నుగా పవ్వళించిన రోజు
నాకు నిజంగా భయమేసింది ఒక్కక్షణం
మీరు నన్ను బంధిస్తారేమో అనీ
ఇక నా అడుగులూ ఆటలూ సాగవేమో అనీ..

నా చాదస్తం కానీ
కాలినడకకోసం కారులో వచ్చి వాలే మీరు
నడక నటిస్తూ
కన్వేయర్ బెల్టు మీదనే
కిలోమీటర్లు నడిచేయగల మీరు
కాలం నడకల మీద
కాలు మోప గలుగుతారా?
కాలాన్నీ వేగాన్నీ కలిపి
లెక్కలు కట్టడమే కానీ
లెక్క లేకుండా మీరు కాలరాచే కాలానికి
ఒక్కసారైనా
పశ్చాత్తాపమైనా ప్రకటించారా?

అయినా భయమే
మనుషుల్లోనూ మహాత్ములుంటారేమో!
హఠాత్తుగా విస్ఫుటించి వికసిస్తారేమో!
వికటించి నా పైనే దాడిచేస్తారేమో
గాటంగా గాయపరుస్తారేమో!
యుగయుగాలుగా ప్రయత్నిస్తూనే ఉన్నారుగా
నన్నే ఆపాలనో నాతోనే సాగాలనో..
నన్నే దాటి పోవాలనో నా వెనుకే దాగాలనో
నేను కలిసిరాకనే అలా ఉన్నారు కానీ
కుదిరితే డబ్బాల్లో పెట్టి నన్నమ్మరూ మీరూ?
ఒకటి కొనండి ఒకటి పొందండిఅంటూ
రెండూ కలిపి ఒకేసారి అమ్మరూ మీరు?
ఇప్పటికైనా తక్కువా?
రేపటి నా రూపాన్ని ఈ రోజే నిరూపించి
పంచాంగాల పేరుతో
పబ్బం గడుపుకుంటున్నారుగా?

ఆశో అవకాశమో ఆలంబనం
మీ గతికీ పురోగతికీ
ఆకాశమూ ఆవేశమూ హద్దు
నా స్థితికీ పురఃప్రవృత్తికీ
తిరోగతి గానీ తిరిగి చూడటం గానీ
నా పద్ధతి కాదూ నా పరిణతీ కాదు
ఒక వెనుకడుగు
వేయి ముందడుగులకు వెన్నుపోటు
ఒక తిలకాష్టమహిషబంధం
వేయి అహంకారాల వెన్నులో కలవరపాటు ❍

17

అన్నం నుండీ ఆనందం వైపు
తనువు నుండీ తన్మయత్వం వైపు
బ్రతుకునుండీ బంధాల వైపు
బాధ్యతల నుండీ విముక్తి వైపు
తడినుండీ పొడి వైపు
మంద నుండీ మడి వైపు
నరం నుండీ నాలుక వైపు
పరార్థం నుండీ స్వార్థం వైపు
ఇహం నుండీ పరం వైపు
తరం నుండీ తరం వైపు
తడబడుతూ పడుతున్న మీ అడుగులు
పుట్టి బుద్ధెరిగిన నాటినుండీ
పూర్తిగా గమనిస్తూనే ఉన్నా

ఎన్నెన్ని తలపులూ
ఎన్నెన్ని సిద్ధాంతాలూ
పదిచేతులూ ఒక్కటి కావటానికీ
పెడబుద్ధులూ దారికి రావటానికీ..
ఎడేదో పెడేదో తెలియకుండానే
ఎన్నెన్ని ధర్మసూత్రాలూ
ఎన్నెన్ని శాస్త్రాలూ
ఎన్నెన్ని అంతరార్థాలూ
అన్నింటినీ ముడివేసేది నేనే అయినా

ముడిమీద ముడి వేసి
మీరు మురిసిపోతారు
సమంగా ముళ్ళు వేస్తే
చక్కగా ఉంటామని
భయమేసిందో ఏమో మీకు
విషమం చేసి మూడో ముడివేసి మరీ
వెల్లకిలా పడుతుంటారు

అవసర మెంతటిదైనా
అందరూ ఒక్కటై నిందించినా
ఆగే అలవాటు లేదు నా అంతట నాకు
పువ్వు పలుకరించినా
పుప్పొడి గులాం చల్లినా
మకరందగంధం చిలికించినా
అన్నీ అనుభవిస్తాను
ఆగకుండానే నేను
చలిమంటల చుట్టూ
కాళ్ళు ముడిచి కూర్చొని
కందికంపతో పాటు
కాలానికీ సెగబెడతారు మీరు
మీ పిచ్చితనం కాకపోతే
కాలానికి చలేమిటి?
కాలుష్యానికి కలేమిటి?

18

అందరిమీదా పెత్తనాలు చేసే
అధికారం నాదనుకుంటారు
కానీ
నాదంటూ ఏదీ లేకుండా
నేనంటూ ఏమీ మిగలకుండా
మీ అందరే నేనుగా
మీ అందరిదీ నాదిగా
ఆగకుండా అనుక్షణమూ
సాగిపోవలసిన శాపమో
సాగిపోగల వరమో నాకు
ఏ ముని అనుగ్రహించాడో?
ఏ క్షణాన పరిగ్రహించానో?

గ్రహాలు ఆగుతాయి
ముచ్చటేస్తే వెనక్కు మళ్ళుతాయి
ఉచ్చస్థానాలూ నీచస్థానాలూ
ఆధిపత్యాలూ ఆధిపత్యశుభాలూ
ఎన్నెన్ని సౌకర్యాలో వాటికి
లెక్కలేసేదేమో నన్ను బట్టే
కానీ
ఏ యోగమూ లేని
నిరంతరసంచారం నాది

గ్రహాలు తిరుగుతాయి
లేకుంటే పడిపోతాయి
భూమి తిరుగుతుంది
లేకుంటే దొర్లిపోతుందది
కాలం కదులుతూనే ఉండాలి
లేకుంటే కలుషిత మవుతుందది
నిలవవున్న నీళ్ళలా
కొడిగట్టిన దివ్వెలా
బిరుసెక్కిన నేలలా
మలిన మైన గాలిలా

నేను పుట్టకముందు
నేనున్నానో లేదో తెలీదు కానీ
మీ లెక్కలో నేను మరణించినా
మీరు బ్రతికినంతకాలం నేనుంటాను
నాకు మరణం లేదు
నేను చిరంజీవినీ కాదు
సర్వాధారత నా లక్షణం
నేనుంటేనే మీరన్నది నిజం
మీరుంటేనే నేనన్నది పచ్చినిజం
మీ ఆయుష్షునూ నా ఆయుష్షునూ కలిపి
సగం సగం చేసుకొని సాగుతూనే ఉందాం ❍

19

అదే వేగం అదే రాగం
అదే భావం అదే బంధం
నడిచినా ప్రాకినా
ఎగిరినా తగిలినా
ఎగిసిపడటమూ లేదు
బిగిసిపోవటమూ లేదు
మానవుల్లో మమతల్లాగా
కరిగిపోవటమూ లేదు
ఎడారుల్లో ఎండమావిలా
మిడిసిపడటమూ లేదు

నేల మంచిదే
బాటలోనే గతుకులు
ఊరు గొప్పదే
ఉన్నవారిలోనే తేడా
మనిషి మంచివాడే
మనస్సులకే చెదలు
కాలం కూడా మంచిదే
కదులుతున్న అడుగులే వంకర

మనస్సుకు మలాం పట్టీని నేను
ఎన్ని గాయాలైనా
ఇట్టే మాయం చేస్తుంటాను

మమతలకు మంచుముక్కల పెట్టెను నేను
ఎంత కాలమైనా
ఇగిరిపోకుండా చూస్తుంటాను
మెరుగులూ తరుగులూ లేని బంగారాన్ని
మట్టిలో పుట్టినా తేజస్సునై వెలుగుతాను
కరువులూ కాటకాలూ లేని కలవారి కలను
స్వాప్నికజగత్తులోనూ మెలకువనై తరిస్తాను

తలక్రిందుల తపస్సు చేసినా
కాలం కాస్త కనికరిస్తేనే
కావలసినవాడు కనిపించేది
పెట్ట.. పైన పొదిగితేనే చాలదు
లోపలి పిల్ల రోజులు లెక్కపెట్టాకే
గ్రుడ్డులోనుండీ బయటకు వచ్చేది
ఎగాదిగా చూసి ఏం లాభం?
చూడగల కళ్ళుంటే
మీముందే కదిలే రంగుల చిత్రాన్ని నేను
మీ చుట్టూ తిరుగుతున్న
ఏడువన్నెల వలయాన్ని నేను
మీరెరిగిన వాళ్ళలో నన్ను చూడటం కాదు
నేనెరగని వాళ్ళు మీలో కనిపిస్తారేమో వెతకండి ❍

20

తాను ముందో నేను ముందో తేలే లోగానే
తాను మరీ వెనక్కు వెళ్ళి పోయాడు
నన్ను ముందుకు నెట్టి కదిలించి వదిలాడు
ఆగాలని ఆగం చేయకుండా
నేను నడుస్తూనే ఉన్నాను

అధ్వాన్నంగా ఉండటానికి
ఎన్ని రుచులో ఎన్నెన్ని రకాలో
అలసట లేకుండా ఆడుకోడానికి
ఎన్ని రంగులో ఎన్నెన్ని రూపాలో
మిట్టాపల్లం ఆటకోసం
కొండలూ లోయలూ
వంగుళ్ళూ దూకుళ్ళకోసం
ఎన్నెన్నో వాగులూ వంకలూ
కోతికొమ్మచ్చి ఆడుకోవాలంటే
లోయల్లో పుట్టి కొండలనూ తాకే తరువులూ
అంతరాల్లో మరువులూ
ఈతలాడుకోవాలంటే
ఏ దిక్కునైనా ఈతకొలనులే
అన్నింటినీ అలా చూపి పరవశించటమో
కరచరణస్పర్శతో పలకరించటమో తప్ప
ఆగి ఆడుకొనే అవకాశం నాకేది?

యాగశాలల్లో సోమరసం పుచ్చుకున్నా
భోగశాలల్లో బ్రాందీ విస్కీ త్రాగా
కడలిమీద కదులుతూ ఉప్పునీరు చవిచూశా
మధువనమార్గంలో మకరందం రుచిచూశా
మత్తూ లేదు మగతా లేదు
మాలిమి కావాలన్న మనసూ పుట్టలేదు
పానపాత్రల ప్రణయభారాన్ని
పరవశంగా చూస్తూ సాగా

తొలకరికి పులకరించిన పుడమి
గంధమాదనమై తావులు చిలుకుతుంటే
నిలువెల్లా పరిమళమయ్యానే కానీ
నిలిచానా నేను?
వడగళ్ళు మీద పడి ఒళ్ళంతా జలదరించినా
కాళ్ళు తడికాకుండా కదలిపోయానే కానీ
ఎక్కడా ఆగలేదే
ఏరుకుని ఆడుకుందామని

మీలాగే నేనూ నా లాగే మీరూ
సాగుతూనే సరదాలు తీర్చుకుందాం
ఏ అభ్యుదయగీతికా
చరణాలు ప్రసరించకుండా
పల్లవితో ఆగిపోకూడదు
ఏ అధ్యయనవీచికా
తీరం తాకకుండా
భంగపడి బ్రద్దలు కాకూడదు ❍

21

మీరంతా
వేకువలో వేగుచుక్కలై
పగలంతా పసిడి ముక్కలై
రోజంతా వెలుగుదిక్కులై
కురిసే చినుకులకు
విరిసే కలికలకు
మొలిచే మొక్కలకూ
పిలిచే పిట్టలకూ
చెడుమరకలు లేని సౌహార్దంగా
అరమరికలు లేని ఆలంబనంగా
ఆటుపోటెరుగని ఆధారంగా
నిలిచి చూడండి
పదిమందినీ
నిలిపి చూడండి
అప్పుడు నేనుండను

పాలుపోసుకున్న కంకులుగా
పదిమందీ నిలిచి
జాలువారుతున్న వెన్నెలలై
వెల్లదనాన్ని పంచి
పొడుస్తున్న రిక్కల్లా
ఒక్కరొక్కరే వచ్చి
ఉన్నచోటే ఊపిరూదిన

ఆకాశమై వాలి
ఊరికంతా ఒకే గొడుగై
కోరికంతా జనం కొరకై
పలకరింతలతో పరిహాసాలతో
ప్రకల్పాలతో ప్రరోచనలతో
ప్రపంచవేదపు క్రమఘనజటలై
పరిసరజీవనఫలైకగతులై
ప్రగల్భాలతో సవాలు చేస్తే
నేనే వెనుకబడి
సిగ్గుతో చితికిపోతా
గాలిలో తేలిపోతూ
మహాభినిష్క్రమణం చేస్తా

22

పుట్టీ పుట్టగానే తాను
పెద్దపెట్టున ఏడ్చాడు
ఇంత మంచిలోకంలోకి
ఇంత ఆలస్యంగా వచ్చినందుకు

తన బుగ్గ గిల్లి మరీ
మురిసిపోయేవారు అప్పట్లో
తన అందం వారి ఆనందంగా
ఎలా మారుతోందో
అర్థ మయ్యేది కాదు
తనకూ నాకూ

చక్కిలిగింతలతో
నవ్వించేవారు కొందరు
ఆ నవ్వు వారి హృదయకుసుమాలకు
ఎలా పరిమళ మయ్యేదో
ఎప్పుడూ తెలిసేది కాదు
తాను తారంగ మంటే
కృష్ణుడు తాండవ మాడినట్లే
తన బుగ్గలు సొట్టపడితే
ప్రకృతి పరవశించి పులకరించినట్టే
వచ్చీ రాని మాటలకు
తాను సిగ్గుపడుతుంటే
అవి వేదమంత్రాలుగా
ఎలా వినిపించేవో తెలిసేది కాదు

అప్పుడే పొడమిన పసిమబ్బులా
తానలా సుతారంగా పడుకుంటే
ఎంతమంది తల్లులు
దిష్టితీయటానికి బారులు తీరే వారో!

తానే పెరిగాడో
వాళ్ళే తగ్గారో తెలీదు కానీ
ఇప్పుడేదో తేడా

తన పెదాలు విచ్చుకున్నా
మూతిముడుస్తున్నారు కొందరు
తన బుగ్గలు కెంపులు పూయిస్తే
వాళ్ళ కళ్ళలో ఎందుకో ఎర్రజీరలు
ఇంత భ్రాంతిలోకి ఎలా వెళ్తున్నాడో ?
గిచ్చి చూసుకున్నాడు
తాను బాగానే ఉన్నాడు..
వాళ్ళనూ గిల్లి చూస్తే,
చాదస్తపు మొగుళ్ళు ఏడుస్తారేమో

లోతుగా ఆలోచించే కొద్దీ
తన మూతీ వంకర్లు తిరుగుతుందని భయం
తన నొసలూ వెక్కిరిస్తుందేమో!
నిజాయితీగా చెప్పే మనుషులను అడగాలి
వారికోసం
కళ్ళలో కలికం వేసుకుని మరీ వెదకాలి
“నన్నోడి తన్నోడెనా? తన్నోడి నన్నోడెనా”
అన్న ద్రౌపది ప్రశ్నలా మిగిలిపోకూడదు..

23

ఎన్నిమార్లు ఇలా
గీచిన గీతలే గీస్తూ
రాసిన కవితలే రాస్తూ
గుదిగ్రుచ్చి చూసిన మాలల్లాగా
యెద త్రచ్చి తెచ్చిన వెన్నల్లాగా

చెదరిపోయిన క్షణాలనన్నీ
చిల్లపెంకుల్లా ఏరుకుంటూ
చెరువు గట్టున కూర్చొని
చెరువుకే శాపనార్థాలు పెడుతూ
ఎంతకాల మిలా?

నాతోనే నడవమంటే
నామోషీ కదా మీకు
నాగరికతావ్యామోహంలో
ముందుకొకటే ఉరుకు
ఆధునికానంతరకాలాన్నీ
మీరే శాసించేస్తారు
అప్పటివాళ్ళు ఏ నోట్లో
ఎన్ని వేళ్ళు వేసుకోవాలో!
ఆదిమానవుని ఆలోచనలనూ
మీ కొలబద్దలతోనే కొలుస్తుంటారు

మట్టివాసనలు మీరే నిర్ణయిస్తారు
పూలకూ పండ్లకూ
రంగులు మారుస్తారు
రుచులూ మారుస్తారు
చింతకాయ పులుపో తీపో
తేల్చుకోలేని స్థితి
చింతకాయకే కల్పిస్తారు

నా మట్టుకు నాకు
సొంతరూపం లేదు కాబట్టి
సరిపోయింది కానీ
లేకపోతే మీ ఇళ్ళలోనే కట్టేసి
నన్నూ శాసించరూ!
నా లెక్కల ఎక్కాలు
నాతోనే వల్లెవేయించరూ!
మీకు దూరమై బ్రతకలేని
విశ్వతోభావన నాది
నన్ను మీలో కలుపుకోలేని
పిదపకాలపు బుద్ధులు మీవి
ఇద్దరికీ తప్పదు
సమాంతరంగానే సాగుతుంటాం
ఎవరిమెప్పుకోసమో ఏమో
ఈసురోమని బ్రతుకుతుంటాం

24

తాను వదిలిన బాణాలు
తన రథం వెనుకే పడుతుంటే
కలతపడని అర్జునుణ్ణి అడగండి
నాతో పోటీ పడటం నేర్పుతాడు

చినుకు చినుకుకూ మధ్య
చిద్విలాసంగా నడుస్తూ కూడా
తడవని సహదేవుణ్ణి అడగండి
నేను తగలని మెలకువ నేర్పుతాడు

వరపరీక్షల ఉబలాటంతో
ఒంటి మీదికి వేవిళ్ళు తెచ్చుకున్న
పృథ నడిగి చూడండి చెప్తుంది
నవయుగాలైన నవమాసాల గురించి

శాపాలతోనో శాపనార్థాలతోనో
కనికట్టుతోనో కర్మసిద్ధాంతాలతోనో
నన్ను ఆపడాలు ఆపద్ధర్మాలే
నేనూ తలవంచే నీతిసూత్రాలే
నిజం మాత్రం నిష్ఠూరంగానే ఉంటుంది

వేదకాలంలో మొలిచిన మానవుడు
ఇప్పటికీ మారాకు తొడగలేదు
ఒంటికొమ్ము బ్రహ్మరాక్షసుడుగా

ఇరుగుపొరుగును బెదిరిస్తూనే ఉన్నాడు
ప్రపంచక్షేత్రంలో ఉమ్మడివ్యవసాయం చేస్తూ
తన చేతికందిన పంట తనదే నంటూ
ఉమ్మడితనానికే ఊపిరాపేస్తున్నాడే

నా తనువు తాకని వస్తువేదీ లేదు
నన్ను కాదనగల ప్రకృతీ లేదు
అయినా నాదంటూ ఏదీలేదు
నాది కానిదీ ఏదీ లేదు
అందుకే నేను అన్నీ ఉన్న ఆకును

పచ్చికుండల్లాంటివి జీవితాలు
కాలం కాల్చగలదూ కరిగించనూ గలదు
కాల్చేదాకా కూడా అగలేరే మీరు
ఒత్తిళ్ళవరదల్లో చిక్కి నిలువెల్లా కరిగిపోతారు
కాలానికే నగిషీలు చెక్కాలనే తపనతో
కాలక్షేపమై మిగిలిపోతారు చివరకు

మీరు నన్ను గడపటమో
నేను మిమ్ము నడపటమో
స్పష్టంగా తెలిసేలోపే
ఇద్దరమూ అంతర్ధాన మవుతాం
ఆశ అంతమై మీరూ
ఆశాంతం తాకి నేనూ ❍

25

అటు చూసి ఇటుచూసేలోపు
అద్భుతావిష్కరణలతో
ఆద్యంతమూ మారిపోయే
ఆషాఢప్రయత్నాలు చేస్తుంటారు
అనుక్షణభయంతో
అన్నీ అమ్ముతుంటారు
అన్నీ కొంటుంటారు
దేన్నీ అనుభవించటం కుదరని
దిగాలుపడ్డ జాతకాలై కనిపిస్తుంటారు

నీడంటే భయం
నిజాలు బయటకు లాగుతుందేమో అని
నిజమంటే భయం
నిన్ను నిలువునా దహిస్తుందేమో అని
వాడంటే భయం
వీడంటే భయం
అటూ ఇటూ ఉండి అణిచేస్తారేమో అని
తాడంటే భయం
పాములా మారి పగ సాధిస్తుందేమో అని

కొండలెక్కుతాను లోయల్లో పడతాను
నేలపై నీటిపై నిప్పుపై నింగిపై
నీకూ నాకూ తెలియని

నిమ్నోన్నతాలపై
రమిస్తూనో భ్రమిస్తూనో
రసిస్తూనో హసిస్తూనో
పడుతూ లేస్తూ
భయానికీ ధైర్యం చెపుతూ
బంగారంగా బ్రతికేస్తుంటాను

గాలికి భయం
ఎప్పుడాగిపోతానో అని
సూర్యుడికీ భయం
కాలమేఘాలు కప్పేస్తాయని
మృత్యువుకూ భయం
ప్రపంచం తనను జయిస్తుందేమో అని
మీకూ నాకూ భయమెందుకు?
ఉండమంటే ఉందాం
పొమ్మంటే పోదాం

నాకంటూ బ్రతుకు లేదు
మీ బ్రతుకే నా బ్రతుకు
నా కంటూ ముగింపు లేదు
అంతా ముగిసిపోయినా నిరీక్షిస్తాను
అనంతరతరంకోసం
మీరు చిరంజీవులైతే
మీతోపాటే నడిచేది నేను
మీరు పరాన్నభుక్కులైతే
పరామర్శిస్తూ పదిలంగా నేను

26

కొండరంతే
ఎక్కడి కక్కడే ఆగిపోతారు
ఈడ్చుకొని పోదామని నేనూగినా
అడుగైనా కదపరు
ఆవంతైనా కదలరు
పైపెచ్చు నన్నే వెనక్కు లాగుతామంటారు
ఎముకల బొమ్మలు పెట్టి బెదిరిస్తూ

నిన్న ఇంకిన వాననీరు
పైపొరల్లోనే ఉంది గుర్తించమంటారు
మొన్న కరిగిన మంచుకొండ
మనింట్లోనూ ఉంటుంది వెతకమంటారు
బూడిదల్లో మంటను
గాడిదల్లో ఒంటెను
గమనిస్తేనే జ్ఞాని అంటారు

వెన్నలో పాలు తీయాలని
వెచ్చటివేవిళ్ళు పడుతుంటారు
మచ్చికైన పచ్చికల మీద
మాంధాతపాదముద్రలకై
కళ్ళు కాయలు కాచేలా గాలిస్తుంటారు
నీటిబుగ్గల చుట్టూ తిరుగుతూ
బుగ్గలను వేటాడుతుంటారు

ఊరగాయ ముక్కల్లోనుండీ
మీసాలపై నిలిపిన
నిమ్మకాయను గుర్తిస్తుంటారు
వండిన అన్నంలో
బియ్యంమీది పేర్లు
భూతద్దాలతో చూస్తుంటారు
కరవవచ్చిన కుక్కకు
కాలిగోళ్ళు లెక్కెట్టి
మంచిదో కాదో గమనిస్తామంటారు

అదో మాలోకం అంతే..

27

అనాదిగా అటనమే
అభ్యసించిన నాకు
ఇప్పు డిప్పుడే బుద్ధిపుడుతోంది
మీనుండీ నటనం కూడా నేర్చుకోవాలని..

నటరాజు బొమ్మ పెట్టుకొని
నర్తనశాలలోనో
నాట్యమండపంలోనో
తైతక్కలాడవలసిన మీరు
సమాజంలోకి చొచ్చుకవస్తున్నారు
ఎందరి బ్రతుకులకో
ఆట ముగియకముందే
తెరలు వాలుస్తున్నారు
ఆ పాపాన్ని నా మీదకు నెట్టేస్తున్నారు
కాలం బలీయమంటూ
కాదంటే కలిసిరాలేదంటూ

నా మానాన నేను పోతుంటాను
ఎవ్వరికీ అడ్డూ రాను
ఎవ్వరికీ వెన్నుదన్నూ కాను
గుడ్డిగవ్వనైనా పసిడిగడ్డనైనా
సమంగా తాకుతూ సాగిపోతాను
అయినా మీకూ మీ పరిహాసాలకూ

మిగిలిపోయిన మీ విషాదాలకూ
నన్నే ఆలంబనం చేసి ఆడిపోసుకుంటారు

నేను నోరు తెరిచేదాకానే
మీ ఆటలూ పాటలూ
రాటుదేలిన మీ మాటలూ
కానీ
మౌనం నా నుదుట రాసిన గీత
ఎన్నో అనుభవిస్తూ కూడా
ఎవ్వరినీ ఏమీ అనలేని మూగతనం
అందరూ నా వారనుకుంటూ
అలసిపోయిన అనంతాశ్రుకణం...

28

ఇసుక గడియారాలూ
నీళ్ళగడియారాలూ
నీడగడియారాలూ
గోడగడియారాలూ
అక్షరాల ఉంగరాలు
కక్షిదారుల గింగిరాలు
నింగిలో చుక్కలూ
నేలపై దిక్కులూ
ఎన్నెన్ని ఏర్పాట్లో మీకు
రెండు చరబిందువుల మధ్య
నా ఉనికిని కొలిచేందుకు

మనఃప్రసారాలనూ
బుద్ధివికాసాలనూ
భావప్రకాశాలనూ
ధ్యానవిధానాలనూ
గానవినోదాలనూ
జ్ఞాననినాదాలనూ
శ్రద్ధతో స్థిరబుద్ధితో
నిష్ఠతో పరినిష్ఠతో
గమనించి చూడండి
కాలాన్ని కొలవలేరా?

పనులలో ధ్వనులలో
పలుకులో కులుకులో

నడకలో నడతలో
కదిలే ఆకులో
ప్రిదిలే పెంకులో
మబ్బుల మజిలీలలో
నురగల జలీకృతిలో
పోటెత్తిన వయస్సులో
కాటుపోయిన పయస్సులో
కాలాన్ని కొలవలేరా?

మీరు తీసే రాగాల్లో
మీరు పొందే భోగాల్లో
అలవాటైన జపాల్లో
ఆశ చేసే తపాల్లో
ఈగ తీసే తేనెలో
తీగ సాగే సోనలో
శిశువు తీసే కునుకులో
పశువు మేసే కసువులో
కాలం కదలికలు
కనిపించటం లేదా?
లీలగా చూడగలిగితే
లెక్కతేలటం లేదా?

కాలి అడుగుల లెక్కకన్నా
ఖచ్చితమైన గడియారం ఉందా?
కార్యశీలియైన కరం కన్న
కాలం కొలతకు ఉపకరణముందా? ❍

29

ముడీ ముడీ మీరే వేసుకొని
మూడుముళ్ళబంధాలను మీరే పెట్టుకొని
ఏకత్రాటిపై నడిచే నన్ను
ఏదో అంటుంటారు

ఉండచుట్టుకొని ప్రారంభించా నా జీవితాన్ని
ఎప్పుడంటే చెప్పలేను
మీకెంత తెలుసో నాకూ అంతే తెలుసు
ఒక్క ముడీ లేదు ఒక్క చిక్కూ లేదు
కొన చూడాలని ఉండ విప్పుతూనే ఉన్నా
ఇప్పట్లో ముగిసేట్టూ లేదు
కొన కానవస్తే అట్నుంచీ చుట్టుకొచ్చి
మొదలు కనుక్కోవచ్చని ఆశ
ఆ ఆశా తీరేట్టు లేదు

ప్రతి ముడీ మీకు చిక్కుముడే
చిక్కు తీయబోతూ
చిక్కును చిక్కబరుస్తారు
ఈ ఉండలు ఇంతే అంటారు
లాగుతారు పీకుతారు
పుటుక్కున తెంపుతారు
గ్రన్థికళాప్రవీణులు కాబట్టి
ఒక ముడి తెగిపోయినా మీకు లెక్కే లేదు

అసలు
మీలో మీరే లుంగలు చుట్టుకోవడ మాపితే
బయటి ముళ్ళు ఎవరినేం చేయగలవు?
మేకల్లా బ్రతకటం నేర్చుకుంటే
ఏ ముళ్ళైనా ఏం చేయగలవు?

ముడీ ముడీ కలిస్తే బంధం బలపడాల కానీ
తాడు తెగట మేమిటి?
చేతగాని ముళ్ళా?
కూతవేటు బంధాలా?

చలిచీమలకూ చెదపురుగులకూ
అద్వైతప్రవచనం ఎవరు చేస్తారో?
ఎప్పుడు చేస్తారో?

30

ప్రసాదంలోని కలకండపలుకులకూ
పదిలంగా కలుపుకున్న జీడిపప్పుముక్కలకూ
పంచదారకూ పాలగిన్నెకూ
కంచులోటాలకూ ఖాళీచెంబులకూ కూడా
కొద్దో గొప్పో అంటుతూనే ఉంది
భక్తివేదాంతతత్త్వం
మీకే
ఎక్కడ అంటుకుంటుందో అని
ఎక్కడా లేని భయం
అక్కడే లేచి దులుపుకోగానే
అంతా మటుమాయం

మళ్ళీ మామూలుగానే
ఏ ముడి ఎటు నడుపుతుందో
ఏ జడం ఎటు దొర్లుతుందో
ఎప్పుడూ బెంగ!

భక్తీ అంటదు వేదాంతమూ అంటదు
కాలం కలిసొస్తేనే ఏదైనా అంటూ
కావాలని నన్ను ముగ్గులోకి లాగుతారు
ఆధ్యాత్మికత పేరుతో అస్తవ్యస్తప్రవచనాలూ
అందరూ తన్మయత్వాన్నీ నటిస్తూ
ఎవరి లాభం వారు వెతుక్కోవడాలూ

పోసేవాడి పోడిమి పోసేవాడిది
త్రాగేవాడి తపన త్రాగేవాడిది
ఇద్దరికీ కలిపి పెద్దముసుగు చలివేంద్రం
జనం కళ్ళు కప్పినంత తేలికా
కాలం కళ్ళు కప్పటం?

అడ్డంగానే నడుస్తూ
నిట్టనిలువుగా నిలుస్తారు
నిటారుగా నిలుస్తారు కానీ
అడ్డదిడ్డంగా ప్రవర్తిస్తారు
ఎవరు మేధావులు కాదో
ఎవ్వరికీ తెలీదు
ఎవరు కొంగజపాల మహాత్ములో
కొంగలకూ తెలీదు

చేపల వేట చివరికొచ్చేదాకా
కొంగైనా జపర్షే
కాలం పండబారేదాకా
మహర్షీ కిరాతకుడే

31

మంచు మట్టసంగా పరుచుకొని
గిరిదరుల పొరల పొదల్లోకి
మందమందంగా చొచ్చుకొని
ధ్రువప్రాంతాన్ని ధ్రువీకరిస్తుంటే
ముసుగుదన్ని పడుకున్న
మూడుకాలాల ముద్దలా
ముచ్చటగా కనిపిస్తోంది గదూ!
అదేమైనా
మనిషి వేసిన బాటా?
మనసు పలకని మాటా?
అదృశ్యమై అంతరించిపోటానికి

యుగయుగాలుగా
కాలంతో చేసుకున్న ఒప్పందం
"నువ్వు కదులుతూనే ఉండు
నేను కరుగుతూనే ఉంటా
ఇద్దరమూ ఒక్కటై
అందరికీ ఆలంబన మవుదా"మని
అయినా
కాలమూ కరుగుతూనే ఉంటుంది
తనకు మాత్రమే తెలిసిన ద్రవీభవనంతో
తలమునకలైపోతూ
జనాభ్యుదయం కోసం పునర్ఘనీభవిస్తూ

తనకు మాత్రమే చేతనైన
నిరంతరపురోగతిశీలతతో
నిర్ఛిద్రకరచరణసంచరణాలతో
నిగమావృతగగనతలంతో..
నీతిశతకాలు రాసి
నిన్నూ నన్నూ బెదరకొట్టకుండా
లయ కుదరని రాగాలతో
నాకూ నీకూ ఉరి బిగించకుండా

కాలం కరిగి కరిగి
చుక్కలు చుక్కలుగా జారిపడుతుంటే
ఆవృతాలనే లెక్కెట్టుకుంటూ
అదే సుఖ మనుకొనే
గానుగెద్దులకు మరీ భయం
గంతలు కట్టుకొని నడుస్తున్నా
కాలంచినుకు
కళ్ళమీదనే కాటు వేస్తుందని
మళ్ళీ మళ్ళీ రానిరోజులు
మాయ చేసి మగతలోకి నెట్టేస్తాయేమో అని

ఎన్ని కళ్ళు చిట్లించి చూస్తున్నా
చిరునవ్వుతో మెలగటం చురుకుదనం
ఎంతమంది వెంటపడి తరుముతున్నా
మామూలుగానే నడవటం మనిషితనం

32

తీరం తాకేలోపే
అలల వంకలు తీరవచ్చు
కలల శంకలు మారవచ్చు
మమత లెక్కలు మాయవచ్చు
సమత దిక్కుల చెదరవచ్చు

రెప్ప వాలేలోగానే
కన్ను కలగా తోచవచ్చు
మన్ను మనిషై నిలవవచ్చు
శిల్పమై శిల చెలగవచ్చు
కల్పమై తలపెగయపచ్చు

కప్పదాటులోపే
నింగి నేలకు వ్రాలవచ్చు
క్రుంగి పుడమీ కూలవచ్చు
వలల కన్నులు మూయవచ్చు
తలపు వెన్నెల కాయవచ్చు

ఆ ఒక్కక్షణంలోనే
కాలం కంకాళమై
కరాళనృత్యం చేస్తుంది
కాలం కరుణాంతరంగమై
కన్నీటితుడుపు అవుతుంది

కాలం కనీనికయై
ప్రపంచానికి రంగులద్దుతుంది
కాలం సౌందర్యపిపాసతో
గరికమీది బిందువులకు
ఘనంగా స్వాగతం పలుకుతుంది

కాలం భంగపడని కెరటమై
ఏ తీరం వైపో సాగుతూనే ఉంటుంది
కాలం మ్రింగుడు పడని కథయై
ఆజీవితాంతం గొంతు పట్టేస్తుంది
కాలం దేనికీ లొంగని కళయై
వర్ణవిన్యాసాలను ఒలికిస్తుంది
కాలం నిన్న మెరిసిన మెరుపు ముక్కై
ఆప్రభాతం వెలుగులు చిమ్ముతుంది
కాలం అందరూ ఉన్నా ఎవ్వరూ లేనట్టు
పిలిచినా ఆగకుండా పురోగమిస్తుంటుంది

33

పుట్టినప్పటినుండే అనుకుంటాను
అనుకుంటూనే ఉన్నా
ఎంతదూర మిలా సాగటం
ఎక్కడో ఒకక్కడ ఆగుదామని

చెట్టు నడిగా పిట్ట నడిగా
గట్టు నడిగా గుట్టు నడిగా
కాలిపోయే కట్టె నడిగా
రాలి జారే మట్ట నడిగా

మాట నడిగా పాట నడిగా
ఏటి నడిగా తోట నడిగా
కదలు టెరుగని బాట నడిగా
కథలు పలకని పూట నడిగా

నేల నడిగా గాలి నడిగా
నీటి నడిగా నిప్పు నడిగా
కూలిపోనీ కప్పు నడిగా
వాలిపోయే వంక నడిగా

ఏ ఒక్కటీ ఒప్పుకోలేదు
ఆగడానికైనా
వెనుకంజ వేసే
ఆగడానికైనా..

చైతన్య ముంటేనే
అందమైనా చందమైనా
స్పందన లుంటేనే
కవితైనా భవితైనా
పొంగుతూ ఉంటేనే
వాగైనా వంకైనా
పారుతూ ఉంటేనే
ఏరైనా తేరైనా
పొలమారితేనే
మరణమైనా స్మరణమైనా....
కదలిక ఉంటేనే
కాలమైనా గోళమైనా ❍

కవి పరిచయం

డా. సూరం శ్రీనివాసులు

జననం	:	03-06-1951, నెల్లూరు
తల్లిదండ్రులు	:	కడయింటి శేషమ్మ, సూరం హనుమంతయ్య
విద్యాభ్యాసం	:	20 సం॥ వయస్సు వరకు నెల్లూరులోనే
ప్రాథమిక విద్య	:	1-3 తరగతి ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్, అత్తితోట అగ్రహారం 4-5 తరగతి ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్, ఉస్మాన్ సాహెబ్ పేట
ఉన్నత విద్య	:	6-8 తరగతి - వి.ఆర్. హైస్కూల్ 9 - ఎస్.ఎస్.ఎల్.సి. - వేద సంస్కృత పాఠశాల - 1967, మూలపేట
కళాశాల విద్య	:	సాహిత్య శిరోమణి, వేద సంస్కృత కళాశాల – 1971, మూలపేట (శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రథమస్థానం)
ప్రైవేటుగా	:	పి.ఒ.ఎల్. 1975, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు. భాషా ప్రవీణ 1976, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు. ఎమ్.ఎ. (సంస్కృతం) 1977, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు. ఎమ్.ఎ. తెలుగు 1978, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు. పి. హెచ్.డి. 1986, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు.
ఉద్యోగం	:	1971 - 1972, ఎస్.వి.ఎస్.ఓ.ఎస్. స్కూల్, చేకూరపాడు, ప్రకాశం జిల్లా.
లెక్చరర్	:	1972 - 1976, ఓరియంటల్ కాలేజ్, ఏలూరు & ఓరియంటల్ కాలేజీ, చిననింద్రకొలను. 1976 - 1980, ఓరియంటల్ కాలేజీ, పొన్నూరు.
ప్రిన్సిపల్	:	1980-1990, ఓరియంటల్ కాలేజీ, తాడికొండ. 1990-2009, ఓరియంటల్ కాలేజీ, తిమ్మసముద్రం
పార్ట్ టైమ్ లెక్చరర్	:	ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (1 సంవత్సరం)

Visiting Fellow : రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి. (2008-09)

Adjudicator : For Several Dessertations Submitted for Ph.D.

పురస్కారాలు : - ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉత్తమ గ్రంథం బహుమతి - 1979 'సంస్కృత భాణ సాహిత్య' గ్రంథం
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే ఉత్తమాధ్యాపక బహుమతి-1981
- తెలుగు వెలుగులు - శ్రీనాథపీఠం-1987
- పుష్పకిరీట సన్మానం, చెన్నై
- ఉగాది సాహితీ పురస్కారం, లలితకళా పరిషత్, చీరాల-2001
- బహుముఖ ప్రజ్ఞ పురస్కారం, సహజ సాహితి, చీరాల-2009
- సృజన సాహిత్య పురస్కారం, అద్దంకి-2013
- సి.పి.బ్రౌన్ సాహితీసేవాపురస్కారం, బెంగుళూరు - 2020 నవంబర్
- 1970 విద్యార్థి దశ నుండి వివిధ ప్రాంతాలలో అవధాన సభలలో సన్మానాలు, బిరుద ప్రదానాలు.

వృత్తిపరంగా నిర్వహించిన బాధ్యతలు

1. Member, Academic Council, Acharya Nagarjuna University.
2. Member, Academic Senate, Acharya Nagarjuna University.
3. Member, Board of Studies in Oriental Languages, Aharya Nagarjuna University.
4. Adhoc PG Board of Studies (Sanskrit), Acharya Nagarjuna University.
5. Person, Refresher Courses
6. P.R.O., Oriental College, Resource Teachers Association (AP)

ప్రచురణలు

1. మత్తవిలాసప్రహసనము - తెలుగు అనువాదం - 1974
2. సౌమనస్యము (ఖండకావ్యం - పద్యం) - 1979
3. సంస్కృతప్రహసనసాహిత్యం (విమర్శ) - 1986
4. Hasya and Prahasana: A Critical Study (Ph.D..thesis) - 1989
5. పూజాకుసుమమ్. (రేడియో నాటకం.. సంస్కృతం) - 1985
6. కరావలంబమ్. (" ") - 1987
7. ధూర్తానుభవభాణః (సంస్కృతం)
8. గురువరరంజనభాణః (")

9. కవిజనమండనభాణః (")
10. నటసమాగమభాణః (")
11. సున్నితపుత్రాసు (వచనకవితాసంకలనం) - 2002
12. నికష (విశ్వధర్మవాణి మాసపత్రిక సంపాదకుడుగా వ్రాసిన
సంపాదకీయాల సంకలనం) - 2009
13. రుక్మిణీశవిజయమ్ (సంస్కృతమహాకావ్యానికి విస్తృతంగా తెలుగు వ్యాఖ్య)
14. భవానీ భారతి (అరవిందుని సంస్కృతకావ్యానికి తెలుగు వ్యాఖ్య) - 2019
15. దశావతారస్తోత్రమ్ (వాదిరాజతీర్థరు రచనకు తెలుగువ్యాఖ్య) - 2019
16. శివానందలహరికి జ్యోతిష్మతీ వ్యాఖ్య
(సంస్కృతంలోనే - వ్యాకరణవిశేషప్రస్తావనతో) - 2020
17. రాధాషోడశ నామస్తోత్రం (అర్థతాత్పర్యాలు) - 2020
18. కుమారసంభవమ్(కాళిదాసరచితమ్) (అష్టమసర్గ - తెలుగులో వ్యాఖ్య) - 2021
19. ధాతృప్రశ్నః అథవా వేదాన్తమణ్డనమ్ - 2021
20. స్థావరజంగమం (వచనకవితాగీత) - 2021
21. ఏటివాలు జ్ఞాపకం (వచనకవితాసంపుటి) - 2022
22. రసవిద్య (కవన శిల్ప సమీక్ష) - 2022
23. సంస్కృతభాణసాహిత్యము (విమర్శ)
(ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహూమతి 1979)
24. భారతనిరుక్తి - నన్నయరుచిరార్థసూక్తి - 1983
25. భారతనిరుక్తి - తిక్కన సరసోక్తి
26. భారతనిరుక్తి - ఎఱ్ఱన ధర్మోక్తి
27. జనహిత వ్యాఖ్య (ఆంధ్రమహాభారతము - విరాటపర్వము) - 1989
28. జనహితవ్యాఖ్య (ఆంధ్రమహాభారతము - ఉద్యోగపర్వము) - 2000
29. జనహితవ్యాఖ్య (నిర్వచనోత్తరరామాయణము - తిక్కన) - 2005
30. వ్యాసమహాభారతం - తెలుగువచనం - 2010
(వ్యాసభారతానికియథాతథానువాదం) 20 సంపుటాలు (6000 పుటలు)
31. మహాభారతము — తెలుగు (మూలం..అనువాదం..విశేషాంశాలు..గీతాప్రెస్..
గోరఖ్ పూర్ ప్రచురణ) A4 సైజులో.. 7 సంపుటాలు.. 7250 పుటలు - 2018
32. శ్రీమహాభారతము(సంస్కృతం) విరాటపర్వము
(జనహితవ్యాఖ్య - తెలుగులో - గీతాప్రెస్, గోరఖ్‌పూర్ ప్రచురణ) 2005

(23 - 32 గ్రంథాలకు సహరచయిత డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి)

ఇతరాలు:

1973 నుండి ఆకాశవాణి ద్వారా సంస్కృత పాఠాలు, సంస్కృత ప్రసంగాలు కథలు, ఏక పాత్రలు, సూక్తి సుధ, సద్వాణి, తెలుగు సాహిత్య ప్రసంగాలు -

1973 నుండి జాగృతి, భారతి, నాట్యకళ, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, రచన, సమాలోచనమ్, గైర్వాణి, సుధర్మా, ఆత్మజ్యోతి, సంవిత్, సంస్కృత సమ్మేళనమ్ మొదలైన పత్రికలలో వచన కవితలు, విమర్శ వ్యాసాలు, శ్లోకాలు, నాటికలు ముద్రితాలు, బొమ్మలకొలువు - అసంపూర్ణ నవల - విద్యాజ్యోతిలో సీరియల్

1991 నుండి 'విశ్వ ధర్మ వాణి' పత్రికా సంపాదకత్వం

కుటుంబ వివరాలు:

శ్రీమతి : సులోచన

కుమార్తెలు : 1. మాధవి, BE (Hons) M.S

అల్లుడు : కావూరి శ్యామ్ సుందర్

మనవడు : శ్రీహర్ష

మనవరాలు : గాయత్రి

2. డా॥ సుషమ., M.B.B.S., D.O

అల్లుడు : డా॥ ప్రవీణ్ కుమార్

మనవరాలు : వాహిని

అభీష్ట విషయాలు : 1. అధ్యయనం, అధ్యాపనం

2. ఆధ్యాత్మిక, అది భౌతిక జీవితాల మధ్య సమన్వయాన్ని సాధించేందుకు అనుగుణంగా విశ్లేషణాత్మక పరిశీలన

3. ఆచరణ ప్రాధాన్యం